News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 05 | సంచిక :104 | ఖమ్మం | శుక్రవారం, మే 29, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## హర్మూజ్ జలసంధి ఎవరి సొత్తు కాదు

- చర్చలు విఫలమైతే వెనక్కి తగ్గబోం
- అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి
- ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు
- ప్రపంచ భద్రత కోసం ప్రయత్నిస్తున్నాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు

ఇరాన్‌తో శాంతి చర్చలు కొనసాగిస్తున్నామని చెబుతూనే మరోవైపు అమెరికా సైనిక చర్యలకు దిగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు ఇరాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. హర్మూజ్ ప్రాంతంలో తమ సైన్యానికి ముప్పు పెరుగుతోందని, అందుకే ముందస్తు చర్యగా ఈ దాడులు చేపట్టామని అధికారులు తెలిపారు. ఇక ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే

వివరాలు 2లో..



## సహకార ధోరణితో పరిష్కరించుకోవాలి

- పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం
- కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మోడీ సమీక్ష

తరాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ

వివరాలు 2లో..



కర్ణాటకలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారిపోయాయి. గత కొంతకాలంగా ఊగిసలాడుతున్న నాయకత్వ మార్పు ఎట్టకేలకు ఖరారైంది. సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. దీంతో మూడేళ్ల సిద్ధరామయ్య ప్రభుత్వానికి తెరపడగా.. కొత్త ముఖ్యమంత్రిగా డిప్యూటీ సీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టడం దాదాపు ఖాయమైంది. శుక్రవారం సీఎల్పీ భేటీ జరగనుంది. సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ను ఎన్నుకోనున్నారు. ఇవాళ సాయంత్రం సిద్ధరామయ్య ఢిల్లీకి వెళ్లనున్నారు. ఢిల్లీలో సోనియా, రాహుల్ గాంధీలను కలవనున్నారు. గురువారం ఉదయం బెంగళూరులోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. క్యాబినెట్ సహచరులతో సిద్ధరామయ్య ఏర్పాటు చేసిన బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ కాస్తా ఆయన వీడ్కోలు సమావేశంగా మారిపోయింది. ఈ సమావేశంలో సిద్ధరామయ్య తాను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో కాబోయే సీఎం డీకే శివకుమార్‌తో పాటు మంత్రులందరూ పాల్గొన్నారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి, రాష్ట్ర పగ్గాలను డీకే శివకుమార్‌కు అప్పగించాలని కాంగ్రెస్ హైకమాండ్ తనను కోరినట్లు సిద్ధరామయ్య భావోద్వేగంగా మంత్రులు, ఎమ్మెల్యేలకు వివరించారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్.. సిద్ధరామయ్యను హత్తుకుని, ఆయన పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకోవడం గమనార్హం.

# ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా

- గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత
- అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన
- జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి



కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం

వివరాలు 2లో..

## తెలుగు జాతి గర్వించదగ్గ మహానేత

# ఎన్టీఆర్

హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రీవనం సర్కిల్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అభిమానులు భారీగా వచ్చారు.

### మహానేతను గౌరవించడం ఏ పార్టీకి పరిమితం కాదు
### తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ సమర్థవంతమైన నేత
### ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు రాష్ట్ర ఆత్మగౌరవ ప్రతీక

- కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆరే!
- విగ్రహం ఏర్పాటులో విమర్శలకు తావులేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ

హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రివనం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఘనంగా ఆవిష్కరించారు. కాంగ్రెస్ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఏమిటని చాలా మంది విమర్శిస్తున్నారని.. ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసినా నేను భయపడను, వెనక్కి తగ్గను అని స్పష్టం చేశారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహానేతను గౌరవించడం ఏ పార్టీకి పరిమితం కాదని, అది అందరి

వివరాలు 2లో..



## ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు..

- అన్ని శాఖల లబ్ధిదారుల డేటా సమీకరణ
- పారదర్శక సేవలకు ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్ )

వివరాలు 2లో..

## ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
పొంగులేటి సవావల్‌పై కేటీఆర్ ప్రతిసవాల్

సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది.

వివరాలు 2లో..




## ఎకరం రూ.237 కోట్లు..

రాయదుర్గంలో రియల్ సంచలనం

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మరోసారి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేవలం ఐటీ కారిడార్‌కే పరిమితం కాకుండా, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా మారుతున్న భాగ్యనగరం తన రికార్డులను తానే తిరగరాస్తోంది. తాజాగా రాయదుర్గం నాలెడ్జ్ సిటీ

వివరాలు 2లో..

## ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం

- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు వెల్లడి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు

వివరాలు 2లో..

## రానున్న ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ రైళ్లు

పూర్తి కావచ్చిన కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్
ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ఇక్కడే: అశ్వినీ వైష్ణవ్

కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని చెప్పారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై అశ్వినీ వైష్ణవ్ కీలక సమీక్ష నిర్వహించారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేస్తుందన్నారు. వీటిని దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం

వివరాలు 2లో..



## ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

కావాలనే యాగీచేస్తున్న పలువురు నేతలు
ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయన్న ఉత్తమ్

తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు

వివరాలు 2లో..



## తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు !

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే పక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్నట్లైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.

## ఎకరం రూ.237 కోట్లు..

మొదటిపేజీ తరువాయి..

పరిసరాల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన ఈ-వేలంలో భూముల ధరలు కళ్ళు చెదిరే రీతిలో పలికాయి. సర్వే నంబర్ 83/1లోని పాన్ మక్తా ప్రాంతంలో 6 ఎకరాల 29 గుంటల భూమికి నిర్వహించిన వేలంలో, ఒక ఎకరం ఏకంగా రూ.237 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. గతేడాది అక్టోబర్‌లో ఇదే ప్రాంతంలో ఎకరం రూ.177 కోట్లు పలకగా, కేవలం కొద్ది నెలల వ్యవధిలోనే ఆ ధరను మించిపోయి రియల్ ఎస్టేట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో ఉన్న ఈ భూమి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైనది. ఐటీ కంపెనీలు, హై-రైజ్ టవర్లు, మెట్రో కనెక్టివిటీ ఉండటంతో దేశీయ , అంతర్జాతీయ డెవలపర్లు ఈ వేలంలో పోటాపోటీగా పాల్గొన్నారు. టీజీఐఐసీ నిర్ణయించిన కనీస ధర రూ.139 కోట్లు కాగా, వేలం ముగిసే సమయానికి అది దాదాపు రూ.237 కోట్లకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లోని అత్యంత ఖరీదైన ప్రాంతాలతో పోల్చినా, హైదరాబాద్‌లోని ఈ ధర ఇప్పుడు భారతీయ రియల్ ఎస్టేట్ రంగంలోనే టాప్ రేంజ్‌లో ఉంది. రాయదుర్గం ప్రాంతానికి ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ఇక్కడి భూమి బంగారం కంటే ఎక్కువ విలువైనదిగా ఇన్వెస్టర్లు భావిస్తున్నారు.

## రానున్న ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ రైళ్లు

మొదటిపేజీ తరువాయి..

వినియోగించనున్నట్లు రైల్వే మంత్రి తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయి. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో సురక్షితమైన కోచ్ డిజైన్, ఆధునిక సౌకర్యాలు అమర్చుతాం. ఈ రైళ్లు గంటకు 130 కి.మీ వేగంతో ప్రయాణించేలా రూపొందిస్తాం. వీటిలో రీజనరేటివ్ బ్రేకింగ్ కూడా ఉంటుంది. రైలు బ్రేకులు వేసినప్పుడు అది విద్యుత్ జనరేటర్‌గా మారి, పునరుత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే అధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నాం అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

మొదటిపేజీ తరువాయి..



స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని?పడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఎట్టకేలకు సిద్దరామయ్య రాజీనామా



మొదటిపేజీ తరువాయి..

ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను.

## ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు..

మొదటిపేజీ తరువాయి..

రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డ్ ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం ఈ విషయాన్ని ప్రత్యేకంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డ్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకేచోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత ఖచ్చితంగా చేరుతాయన్నారు. అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సీఎం సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ ప్రభుత్వ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు.ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, ఇన్సూరెన్స్ పథకాలు, ప్రభుత్వం తీసుకువస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు.

## తెలుగు జాతి గర్వించదగ్గ మహానేత ఎన్టీఆర్

మొదటిపేజీ తరువాయి..

బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. జాతీయ స్థాయిలో ఇందిరా గాంధీ పి.వి. నరసింహారావు వంటి నాయకులను అందిస్తే, తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ కూడా అదే స్థాయిలో సమర్థవంతమైన నాయకత్వాన్ని తయారు చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో మాజీ సీఎం కేసీఆర్‌పై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. నాడు ఎన్టీఆర్ లేకుంటే కేసీఆర్ గానీ, లేదా ఇతర నేతలు గానీ ఈ స్థాయికి వచ్చేవాళ్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీ రామారావు అని, ఆయన నీడన బతికి ఈరోజు ఆయన గురించే తక్కువ చేసి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఎన్టీఆర్ పేరు చెప్పుకుని రాజకీయం చేస్తూ, ఆయన విగ్రహాల ఏర్పాటును వ్యతిరేకించడం లేదా తక్కువ చేయడం వారి నకిలీ ఆలోచనలకు నిదర్శనమని రేవంత్ ఎద్దేవా చేశారు.సంక్షేమ పథకాల విషయంలో ఎన్టీఆర్ దార్శనికతను రేవంత్ రెడ్డి ఆకాశానికెత్తారు. ఆనాడు ఎన్టీఆర్ ప్రారంభించిన పక్కా ఇళ్ల పథకమే నేటి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పునాది అని ఆయన గర్వంగా ప్రకటించారు. పేదలకు గూడు కల్పించాలనే ఎన్టీఆర్ సంకల్పాన్ని తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటి నేతలను రాజకీయాలకు పరిచయం చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని, ఆ వారసత్వాన్ని తాము గౌరవిస్తామని తెలిపారు.కాంగ్రెస్ వేదికలపై ఎన్టీఆర్ నామాన్ని జపించడంపై వస్తున్న రాజకీయ విమర్శలను రేవంత్ రెడ్డి కొట్టిపారేశారు. రాజకీయాలకు అతీతంగా ఎన్టీఆర్ ఒక వ్యవస్థ అని, ఆయన విగ్రహం అమీర్‌పేట వంటి ప్రాంతంలో ఉండటం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎన్టీఆర్ వేసిన పునాదులను ఎవరూ విస్మరించలేరని, అలాంటి మహానుభావుడికి నివాళి అర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. మైత్రివనం వద్ద జరిగిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం కేవలం ఒక విగ్రహావిష్కరణలా కాకుండా, రేవంత్ రెడ్డి రాజకీయ చాణక్యానికి వేదికగా మారింది. ఒకవైపు ఎన్టీఆర్ అభిమానులను ఆకట్టుకుంటూనే, మరోవైపు కేసీఆర్ , బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టడంలో రేవంత్ సక్సెస్ అయ్యారు. ఈ పరిణామం తెలుగుదేశం సానుభూతిపరులను కూడా కాంగ్రెస్ వైపు ఆలోచింపజేసేలా ఉందని భావిస్తున్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయటమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే రాజీవ్‌గాంధీ నిర్ణయాన్ని ఎన్టీఆర్ అమలు చేశారు.

## సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలు..

మొదటిపేజీ తరువాయి..

కొలీజియం కసరత్తు చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం, నలుగురు సీనియర్ హైకోర్టు న్యాయమూర్తులను, ఒక సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ జాబితాలో పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీచంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్ దేవ, జమ్మూ కశ్మీర్ లదఖ్ సీజే జస్టిస్ అరుణ్ పల్లి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వి. మోహన ఉన్నారు. సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, న్యాయ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ నియామకాలు అత్యంత కీలకమని కొలీజియం తన సిఫార్సులో పేర్కొంది. కొలీజియం పంపిన ఈ జాబితాను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ పరిశీలించి, కేబినెట్ ఆమోదం కోసం పంపుతుంది. కేంద్ర కేబినెట్ ఆమోదం అనంతరం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేయగానే ఈ నియామకాలు ఖరారవుతాయి. ఆ తర్వాత నూతన న్యాయమూర్తులుగా వీరు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ నియామకాలతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెరిగి, కార్యకలాపాలు మరింత చురుగ్గా సాగే అవకాశం ఉంది.

## అంతరిక్ష రంగంలో హైదరాబాద్ సత్తా..

మొదటిపేజీ తరువాయి..

మరోసారి సత్తా చాటింది. నగరానికి చెందిన అబ్యోమ్ స్పేస్ టెక్ అండ్ డిఫెన్స్ స్టార్టప్, దేశంలోనే తొలి పూర్తి స్థాయి స్వదేశీ పునర్వినియోగ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ క్వాలిఫికేషన్ టెస్ట్ క్యాంపెయిన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మే 27 బుధవారం నాడు మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లాలోని శామీర్‌పేటలో ఉన్న కంపెనీకి చెందిన కమర్షియల్ టెస్ట్ ఫెసిలిటీ వద్ద ఈ పరీక్షలు జరిగాయి. సాధారణంగా రాకెట్ ఇంజిన్లను ఒకసారి వాడిన తర్వాత అవి పనికిరాకుండా



పోతాయి. కానీ, అబ్యోమ్ స్పేస్ టెక్ అభివృద్ధి చేసిన ఈ ఇంజిన్ మళ్లీ మళ్లీ వాడుకోవడానికి వీలుగా రూపొందించారు. ఈ స్టార్టప్ తన సొంత సాంకేతికతతో, ఎవరి సాయం లేకుండా ఫ్లైట్ రెడీ క్రయోజెనిక్ ఇంజిన్, హోప్ వీటీవీఎల్ పునర్వినియోగ రాకెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ మైలురాయిని అధిగమించింది. పునర్వినియోగ రాకెట్ల వల్ల అంతరిక్ష ప్రయోగాల వ్యయం భారీగా తగ్గుతుంది. ఇంజిన్ సిస్టమ్స్, కంట్రోల్ ఆర్కిటెక్చర్, డేటా సేకరణ వ్యవస్థలు ఇలా అన్నీ మన దేశంలోనే, అబ్యోమ్ శాస్త్రవేత్తల చేతుల్లోనే రూపొందాయి. విదేశీ సాంకేతికతపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. ఇది కేవలం పౌర అవసరాలకే కాకుండా రక్షణ రంగంలో కూడా వ్యూహాత్మక ప్రయోజనాలను అందిస్తుంది. బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో ఈ స్టార్టప్ రూపుదిద్దుకుంది. కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో జైనల్ అబిదీన్ తెలిపిన వివరాల ప్రకారం ఇది కేవలం ఒక ఇంజిన్ పరీక్ష మాత్రమే కాదని, భారత్‌లో స్వదేశీ పునర్వినియోగ ప్రొపల్షన్ వ్యవస్థ నిర్మాణానికి ఇది బలమైన పునాది అని అన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

మొదటిపేజీ తరువాయి..

చేపట్టిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం ధాన్యం కొనుగోళ్లపై రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. కొనుగోలు పక్రియను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇకపోతే అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కొని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడిన పరిస్థితులపై మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించామని అన్నారు.

అకాల వర్షాలకు తడిసిన 9,214 టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నష్టం కలిగించే ఎటువంటి చర్యలనూ ప్రభుత్వం ఉపేక్షించబోదని అన్నారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల టన్నుల ధాన్యం చేరగా, అందులో 57 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు.



రైతులకు ఇప్పటివరకు రూ.10,097 కోట్ల చెల్లింపులు జరిగాయని, దీని ద్వారా 8.15 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. కొనుగోలు చేసిన 57 లక్షల టన్నుల ధాన్యంలో 44.67 లక్షల టన్నులు దొడ్డు రకాల ధాన్యం కాగా, 12.33 లక్షల టన్నులు సన్న రకాల ధాన్యం అని మంత్రి పేర్కొన్నారు. ధాన్యాన్ని మిల్లులకు వేగంగా తరలించేందుకు ఇసుక సరఫరా చేసే లారీలను కొనుగోలు కేంద్రాలకు మళ్లించినట్లు తెలిపారు.

## సహకార ధోరణితో పరిష్కరించుకోవాలి

మొదటిపేజీ తరువాయి..

ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్-బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్- అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రధాని మోదీ కెన్ - బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం, ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించారు.

## అన్నదాతలకు న్యాయం చేయకుంటే కలెక్టర్ రేట్ ముట్టడిస్తాం...





సి కె న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా కెమెరామెన్ బోయ కిష్టన్న.బిఆర్ఎస్ పార్టీ గద్వాల ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు
రాబోయే రెండు రోజుల్లో జిల్లాలోని వడ్లు కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి లారీల ద్వారా తెలంగాణ రాష్ట్రం నుండి కర్ణాటక రాష్ట్రానికి రైతులు అమ్ముతున్నారు మిగిలిన వరి లారీలతో తెలంగాణ రాష్ట్రానికి ధాన్యాన్ని తరలించకపోతే భరసా ఆధ్వర్యంలో కలెక్టర్ రేట్ ను ముట్టడిస్తామని బిఆర్ఎస్ పార్టీ గద్వాల ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు హెచ్చరించారు. గురువారం మల్దకల్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తే గోనె సంచులు, హమాలీలు, లారీలు లేక రోజుల తరబడి కేంద్రాలలో రైతులు పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అక్కడ గన్ని బ్యాగులు, టాబ్ ఫారములు లేక హమాలీలు లేక, కొన్న ధాన్యాన్ని తరలించడానికి లారీలు కూడా లేకపోవడంతో రైతులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. దీనికి తోడు అకస్మాతిగా వచ్చే ఆకాల వర్షాలకు దాన్యం పూర్తిగా తడిసిపోవడంతో పాటు కొన్నిచోట్ల మొలకలు రావడంతో రైతు పరిస్థితి దారుణంగా తయారయ్యిందని విమర్శించారు. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని ఆరోపించారు. వీరి వెంట బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు జనార్దన్ రెడ్డి, డి. శేఖర్ నాయుడు, నరసింహులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ నమాజ్ లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ చైర్మన్....



సి కె న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా కెమెరామెన్ బోయ కిష్టన్న. జోగులంబ గద్వాల జిల్లా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సరిత తిరుపతయ్య అభివృద్ధి సహకార సమాఖ్య చైర్ పర్సన్,గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీమతి సరిత తిరుపతయ్య ఈరోజు బక్రీద్ పండుగ సందర్భంగా గద్వాల జిల్లా కేంద్రం లోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో సరిత తిరుపతయ్య పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.
అల్లాహ్ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం పెద్దలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు సరితమ్మ ని ఆత్మీయంగా స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు.వీరితో పాటు.కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు,మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## మోక్షాన్ని పొందడం భక్తి మార్గంతోనే సాధ్యం

జిల్లా టార్గెట్ బాల్ సెక్రెటరీ నగేష్ గుగులోతు

సికె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు
సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గారకుంట తండా గ్రామానికి చెందిన ఆడోత్ సైదా నాయక్ గుగులోతు రమేష్ నాయక్ సుమారు 600 కిలోమీటర్ల దూరాన్ని కాలినడక ద్వారా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాతిరుమల తిరుపతిఅలిపిరి మార్గంలో వీరిని సూర్యాపేట జిల్లా టార్గెట్ బాల్ సెక్రటరీ గుగులోతు నగేష్ కలిసి



అల్పాహారాన్ని అందించి మోక్షాన్ని పొందడం భక్తి మార్గంతోనే సాధ్యమన్నారు కాలినడక ద్వారా పది రోజులపాటు ఈ యాత్ర కొనసాగించడం జరిగింది . వారి ద్వారా వారి భక్తికి మెచ్చి వారిని అలిపిరి మెట్ల వద్ద ఘనంగా సత్కరించి అభినందించారు

# ఘనంగా బక్రీద్ పండుగ వేడుక ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన....

సికే న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా కెమెరామెన్ బోయ కిష్టన్న. ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తెలియజేశారు ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని బక్రీద్ పండుగ సందర్భంగా గోనుపాడు గ్రామంలో,గద్వాల పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులు ఈద్ ముభారక్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఎమ్మెల్యే ఈద్గా వద్ద మైనార్టీ సోదరులకు అలై బలై ఆలింగనాలు చేసుకొని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం ఎమ్మెల్యే నాయకులు కార్యకర్తలు ఇంటికి వెళ్లి బక్రీద్ సందర్భంగా వారు ఏర్పాటుచేసిన తేనేటి విందులో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఎమ్మెల్యే మాట్లాడుతూ. ముస్లిం సోదరీ సోదరీమణులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు ...త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ సందర్భంగా ముస్లిం శుభాకాంక్షలు తెలిపారు. దైవాజ్ఞను అనుసరించి సమాజ హితంకోరి ప్రతీ మానవుడు నిస్వార్థ సేవలను అందించాలనే సందేశం బక్రీద్ మనకు అందిస్తుందని అన్నారు.తమకు కలిగిన దాంట్లోంచి ఎంతో కొంత ఇతరులకు పంచడమనే దాతృత్వ స్వభావాన్ని బక్రీద్ పండుగ ద్వారా నేర్చుకోవాలని అన్నారు.
అల్లా ఆశీస్సులతో గద్వాల నియోజకవర్గం ప్రజలు, రైతులకు, సకాలంలో వర్షాలు కురిసే, సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా అల్లాను కోరుకోవడం జరిగింది.
ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## తెలుగువారి ఆత్మగౌరవం ఎన్టీఆర్ కు103వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు



ఎన్టీఆర్ అభిమాని ఉపసర్పంచ్ జోగు అరవింద్ రెడ్డి

గరిడేపల్లి సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు
తెలుగు నేలపై ఎందరో మహానుభావులు జన్మించారు కానీ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పి, వారి గుండెల్లో దేవుడిగా కొలువైన ఏకైక వ్యక్తి నందమూరి తారక రామారావు అని తెలుగుదేశం పార్టీ హుజూర్నగర్ అసెంబ్లీ ఇన్చార్జి మండవ వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు... ఒక వ్యవస్థ, ఒక ప్రభంజనం అని అన్నారు గురువారం ఆయన 103వ జయంతి సందర్భంగా గరిడేపల్లి మండలం పొనుగోడు , గరిడేపల్లి మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.
శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, వెంకటేశ్వరస్వామి అంటే ఇప్పటికీ తెలుగువారికి ఎన్టీఆర్ రూపమే గుర్తుకొస్తుందన్నారు ఆయన పాత్రల్లోని గాంభీర్యం, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయని కేవలం దేవుడి పాత్రలే కాదు... రావణాసురుడు, దుర్యోధనుడు వంటి ప్రతి నాయక పాత్రలకు కూడా ఆయన తన నటనతో ఒక కొత్త గౌరవాన్ని తెచ్చారన్నారు . 60 ఏళ్ల వయసులో, ఎంతోమంది రాజకీయ విశ్లేషకుల అంచనాలను తలకిందులు చేస్తూ 1982లో 'తెలుగుదేశం' పార్టీని స్థాపించి. "తెలుగువారి ఆత్మగౌరవం" అనే నినాదంతో చైతన్య రథంపై ఆయన చేసిన పర్యటనలు ఒక చరిత్ర అన్నారు రెండు రూపాయలకే కిలో బియ్యం జనతా వస్త్రాలు , పక్కా గృహాలు , పేదలకు కూడు, గుడ్డ, నీడ కల్పించడం ఆస్తిలో మహిళలకు సమాన హక్కు ,మండల వ్యవస్థ ఏర్పాటుచేసి పరిపాలనను ప్రజల వద్దకు చేర్చిన ఘనుడు ఎన్టీఆర్ అని కొనియాడారు
నటుడిగా మూడు వందలకు పైగా చిత్రాల్లో నటించి మెప్పించినా, జననాయకుడిగా కోట్లాది మంది గుండెల్లో స్థానం సంపాదించినా అది ఒక్క ఎన్టీఆర్‌కే సాధ్యమైందన్నారు .ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా... తెలుగు భాష ఉన్నంతవరకు, తెలుగు సినిమా ఉన్నంతవరకు, తెలుగుజాతి ఉన్నంతవరకు 'అన్నగారు'గా ఆయన మన హృదయాల్లో చిరంజీవిగానే ఉంటారన్నారు. అంతకు ముందు గరిడేపల్లి లో పండ్లు పంపిణీ చేయడం పొనుగోడు గ్రామంలో పేదలకు పులిహోర పంపిణీ చేశారు . లితెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జుట్టుకొండ సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాని స్థానిక ఉపసర్పంచ్ జోగు అరవింద రెడ్డి , తెలుగుదేశం పార్టీ గరిడేపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కీసరి నాగయ్య ముదిరాజ్ , పోలగాని సురేష్ గౌడ్ , పాతకోటి లింగారెడ్డి మాజీ సర్పంచు నందిపాటి సైదులు , బిల్లా వెంకటేశ్వర్లు , బాల్తు రామనాథం , సింగిరెడ్డి వెంకటరెడ్డి , బాల్త్ భాస్కర్ , దొంతి రెడ్డి మధుసూదన్ రెడ్డి, నందిపాటి బోడయ్య , చామకూరి వెంకటప్పయ్య జుట్టుకొండ అరుణ, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు

## మాజీ సర్పంచ్ కడియాల వెంకయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

పోకల వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

గరిడేపల్లి సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు
పేద ప్రజల సమస్యలపై నిత్యం పోరాటం చేసి అమరులైన వీరుల ఆశయ సాధన కోసం మనందరం కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్య సభ్యులు పోకల వెంకటేశ్వర్లు పార్టీ కార్యకర్తలను కోరారు. ఈరోజు గరిడేపల్లి మండలంలోని గానుగబండ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు మాజీ సర్పంచ్ కడియాల వెంకయ్య వర్ధంతి సందర్భంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ స్థాపనే ధ్యేయంగా,ఎర్రజెండా పట్టి తెలంగాణ సాయుధ పోరాటం లో పాల్గొని,పేదల తరుపున సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేసి అశువులు బాసిన కామ్రేడ్ కడియాల వెంకయ్య ఆశయ సాధనకు మనందరం పునరుంకితమవుదామని ఆయన ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు కోరారు
గానుగబండ సర్పంచ్ గా గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేసినారాని ఈ సందర్భంగా వారు చేసిన సేవలను



కొనియాడారు.
వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, గ్రామ సర్పంచ్ కడియాల పద్మ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు,కట్టా నర్సింహారావు,పంగ సైదులు,పంగ బక్కయ్య, ముండ్ల వెంకన్న,ఈద ప్రసాద్,షేక్ నభిసాయబు, పీరిసాహెబ్, మెండే వెంకన్న,చింతలచెరువు పుల్లయ్య,ఈద సైదులు, పోకల సాంబయ్య,తాళ్ల తిరుపయ్య, నందిపాటి కాశయ్య,గోధుమల ఈశ్వర చారి,తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన...



సి కె న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా కెమెరామెన్ బోయ కిష్టన్న.తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్ పర్సన్, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సరితమ్మ.
బక్రీద్ పండుగ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం లోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్ పర్సన్,గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సరిత తిరుపతయ్య పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని సరితమ్మ బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు..అనంతరం వారు మాట్లాడుతూ అల్లాహ్ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు,సుఖశాంతులు,సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.అతిధులను ముస్లిం పెద్దలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు సరితమ్మ ని ఆత్మీయంగా స్వాగతించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు,పెద్దపల్లి అల్వాల రాజశేఖర్ రెడ్డి, గోనుపాడ్ శ్రీనివాస్ గౌడ్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, పాతపాలెం ఆనంద్ గౌడ్, కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి,రాము యాదవ్,సతీష్ యాదవ్,జమిల్,సన,జహంగీర్, సద్దాతుల కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు,మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## చింతకాని మండలంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు.


సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు జయంతి మహానాడు పండుగ సందర్భంగా చింతకాని మండలం సీతంపేట నాగులవంచ లచ్చగూడెం గ్రామాల్లో గురువారం సాయంత్రం జయంతి వేడుకలు జరిగినాయి ఆయా గ్రామాల్లో టిడిపి జెండాను ఆవిష్కరించి జన్మదిన కేక్ కట్ చేసి అన్నగారికి నివాళు లర్పించి 44 సంవత్సరాల తెలుగుదేశం పార్టీ ఆవశ్యకత గురించి రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ సంస్కరణలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరించటం జరిగింది ఈ కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాసరావు మండల కార్యనిర్వ కార్యదర్శి మేడా త్రివేణి ఏటుకూరి రవి పసుపులేటి శ్రీనివాసరావు ఎస్.కె నాగూర్ కిలారు వెంకటనారాయణ నెల్లూరు శేషగిరి కిలారి తిరుపతిరావు ఎస్.కె దరియా నారపోగు వెంకటేశ్వర్లు ఎస్.కె హుస్సేన్ ఎస్కె బాల సైదులు చేడి లక్ష్మీప్రసాద్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న మంత్రి సీతక్క.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 28,** తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు కూడా పాల్గొన్నారు. అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సమ్మక్క-సారక్క దేవాలయాన్ని అభివృద్ధి చేసినట్లుగానే భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని కూడా మొదటి విడతలో రూ.351 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులకు సహకరించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భవిష్యత్తులో భద్రాచలం దేశవ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు.



తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వరరావు, ఆలయ ఈవో దామోదర్, సర్పంచ్ పూనెం కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# బక్రీద్ వేడుకలు, ఘనంగా మండల కేంద్రంలో



**మే 28 (సి కే న్యూస్) చేగుంట:** చేగుంట మండల కేంద్రంలోనీ చందాయిపేట మక్కరాజ్ పేట్, అనంతసాగర్, గ్రామాలలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఉదయాన్నే మసీద్ వద్ద అందరూ కలుసుకొని ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలాయి బలాయ్ తీసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు,

అనంతరం మస్జీద్ ఈమమ్ అన్వేర్ ఉల్ హాక్ మాట్లాడుతూ.బక్రీద్ పర్వదినం సందర్భంగా ఈద్గా దగ్గర బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నట్టు తెలిపారు. భక్తి త్యాగం విశ్వాసానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకోవడం జరుగుతుందని వారు అన్నారు.ప్రతి సంవత్సరం రంజాన్ పండగ ముగిసిన తర్వాత బక్రీద్ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.ఆ అల్లా దీవెనెలతో చేగుంట మండల ప్రజలందరూ సంతోషంగా ఉండాలని వారు కోరారు.ఈ కార్యక్రమం లో మస్జీద్ ఈమమ్ అన్వార్ ఉల్ హాక్, మస్జీద్ కమిటీ ఉపాధ్యక్షులు రహీమోద్దీన్, వార్డ్ సభ్యులు అరిఫ్,టీంక సెట్, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురంలో ఘనంగా బక్రీద్ పండగ వేడుకలు....

పెద్ద సంఖ్యలో పాల్గొన్న ముస్లిం సోదరులు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 28.** అశ్వాపురం మండల కేంద్రంలోని మంచికంటినగర్ నందు అశ్వాపురం జామా మసీద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈద్గా ప్రాంగణంలో ఈదుల్ అదా (బక్రీద్ ) నమాజులు మండలంలోని ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు జమాల్ మాట్లాడుతూ, త్యాగానికి ప్రతిరూపమైన ఈ బక్రీద్ పండగ పర్వదినాన దానధర్మాలు, కుర్బానీ చేయడంతో పాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ,రాగద్వేషాలు విడిచిపెట్టి పరమత సహనాన్ని పాటించి, అందరితో సోదర భావంతో, జాలి, దయా, కరుణ అలవాట్లతో మెలగాలని సూచించారు. అదేవిధంగా బక్రీద్ పండగ సారాంశమును వివరిస్తూ ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్ ప్రాణ త్యాగానికి సిద్ధమైన తరుణంలో తన త్యాగానికి మెచ్చుకొని అల్లాహ్ ఆదేశాలు అనుసారం ఒక వంటేను బలిదానం చేయమని చెబుతారు. ఈ విధంగా త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగను పురస్కరించుకొని యావత్ ముస్లిం సోదరులందరూ బక్రీద్ పండగ పర్వదిన రోజు వంటే, ఆవు,ఎద్దు, గొర్రె, మేక వంటి జంతువులను బలిదానం చేసి అందులో మూడు భాగాలుగా విభజించి ఒక భాగం పేద ప్రజలకు, రెండో భాగం బంధువులకు, మూడో భాగంతమ కుటుంబీకులకు పంచుతారు. ఈ పర్వదినాన సమస్త మానవాళికి శాంతిని ప్రసాదించాలని ఆ అల్లాను ప్రార్థించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో... జామా మసీద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత గురువులు , మత పెద్దలు, మండలంలోని ముస్లిం సోదరులందరూ పాల్గొన్నారు.

## ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి,

చేగుంట మండల్ మైనారిటీ, నాయకుల డిమాండ్



**మే 28 (సీ కే న్యూస్) చేగుంట :** బక్రీద్ సందర్భంగా, చేగుంట పట్టణ కేంద్రంలోని గురువారం నాడు ఈద్గాలో బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు శాంతియుత వాతావరణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

దేశంలో ఆవుల పేరుతో జరుగుతున్న, దాడుల నేపథ్యంలో బక్రీద్ సందర్భంగా ఎవరూ ఆవులను బలి ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. జాతీయ పక్షి నెమలి మాదిరిగానే ఆవును కూడా జాతీయ జంతువుగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో మస్జీద్ ఈమమ్ అన్వార్ ఉల్ హాక్, నాయబ్ సదర్ రహేమోద్దీన్, వార్డ్ సభ్యులు మొహమ్మద్ ఆరిఫ్, మొహమ్మద్ ముజామిల్,తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం.




- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి.
- తెలంగాణ రైతాంగం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- చివరి గింజ వరకు కొనుగోలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 28:** తడిసిన ధాన్యాన్ని కూడా తప్పకుండా కొనుగోలు చేస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని సత్వరమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన 9,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు.

అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పడిన పరిస్థితులపై సమీక్షించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు, పోలీసు అధికారులు, రవాణా శాఖ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగానికి నష్టం కలిగించే ఎటువంటి చర్యలను ప్రభుత్వం ఉపేక్షించబోదన్నారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం అని, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి పునరుద్ఘాటించారు.

స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేరగా, అందులో 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ఇప్పటివరకు రూ.10,097 కోట్లు చెల్లించామని, దీని ద్వారా 8.15 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు.

కొనుగోలు చేసిన 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 44.67 లక్షల మెట్రిక్ టన్నులు సాధారణ రకాల ధాన్యం కాగా, 12.33 లక్షల మెట్రిక్ టన్నులు సన్న రకాల ధాన్యమని వివరించారు.

ఇసుక సరఫరాకు వినియోగించే లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మళ్లించి, సత్వరమే ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేందుకు వినియోగిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డు స్థాయిలో కొనుగోళ్లు నిర్వహిస్తుంటే, ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం కొనుగోళ్ల ప్రక్రియపై అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతాంగానికి ఎక్కడా ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్కు ఐ డి ఓ సి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనప కలెక్టర్ వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు.

# అర్హులైన వ్యవసాయ కూలీలందరికీ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి..




**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి..**

**ఉత్సాహంగా జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ మహాసభ..**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 28 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆత్మీయ భరోసా పథకాన్ని అర్హులైన వ్యవసాయ కార్మికులందరికీ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ మహాసభ మడకం పద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం పట్టణం శివారు కాలనీల నుండి వందలాదిమంది పేదలు చుట్టుపక్క గ్రామాల్లో వ్యవసాయ పనులకు వెళ్లి ఉపాధి పొందుతున్నారని అన్నారు. భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో వందలాది మందికి ఉపాధికార్డులు ఉన్నప్పటికీ ప్రభుత్వం పనులు చూపించడం లేదని అన్నారు. అర్హులైన వారందరికీ ఉపాధి పనులు చూపించాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ పనులు చేసే వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా పథకం కింద ప్రభుత్వ హామీ మేరకు సంవత్సరానికి ?12,000/-లు ఇవ్వాలని డిమాండ్ చేశారు..

వి.బి. జి. రామ్ జి ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలి...

కార్మికులు కర్షకులు ఐక్యతతో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి..

సిఐటియు జిల్లా నాయకులు ఎం.బి.నర్సారెడ్డి..

వి.బి. జి. రామ్ జి ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలని,సిఐటియు జిల్లా నాయకులు ఎం బి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ మహాసభలో సౌహార్ద సందేశం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్పులు చేసి వి.బి. జి. రామ్ జి ఉపాధి చట్టాన్ని తేవటం పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనని అన్నారు. కేంద్రంలోని బిజెపి అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని 15 మంది సభ్యులతో ఎన్నుకోవడం జరిగింది. పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా గడ్డం స్వామి బుయ్యని సౌభాగ్యం ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా, మడకం పద్మ, గుండె రమాదేవి, సహాయ కార్యదర్శులుగా కాకా రాధ, బాయమ్మ లు తో పాటు కమిటీ సభ్యులుగా సీతా మహాలక్ష్మి, గోలి జయ సోడి రాజమ్మ కోడె వరలక్ష్మి బాయమ్మ నాగమ్మ సావిత్రి లు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో ఐద్వా జిల్లా అధ్యక్షులు డి సీతాలక్ష్మి, వార్డు మెంబర్ ఇరప అనసూయ,ఐద్వా సీనియర్ నాయకులు నాదెళ్ల లీలావతి,గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కుంజ శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కోరాడ శ్రీనివాస్ ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రవీందర్, సిఐటియు నాయకులు చాట్ల శ్రీనివాస్ రాఘవయ్య రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అపరభగీరధుడు ,అభివృద్ధి ప్రదాత మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి



**గరిడేపల్లి సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో మట్టి రోడ్లన్నీ బీటి రోడ్లుగా మారినాయి అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు త్రిపుర అంజన్ రెడ్డి అన్నారు గరిడేపల్లి మండలం పరిధిలో ఉన్న గానుగబండ గ్రామానికి నలువైపులా గానుగబండ నుంచి హనుమంతుల గూడెం గానుగబండ నుంచి కలమలచెరువు మరియు గానుగబండ నుంచి పర్రెడ్డిగూడెం వరకు ఉన్న మట్టి రోడ్లన్నీ బిటి రోడ్లుగా మంజూరు చేయించి త్వరితగతిన తారు రోడ్లను వేయించినందుకు గానుగ బండ గ్రామ ప్రజల తరపున గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చిత్రపటానికి గానుగబండ - కొండాయిగూడెం గ్రామాల కాంగ్రెస్ నాయకులు మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు కార్యక్రమాలకు సహకరించిన మాజీఎంపీపీ పైడిమారి రంగనాథ్ మరియుమండల కాంగ్రెస్ నాయకులకు కొండాయిగూడెం గ్రామ సర్పంచ్ కందుల మంగమ్మ కోటిరెడ్డి గానుగ బండ మాజీ ఎంపిటిసి పాకాల పరమేష్ గ్రామ శాఖ అధ్యక్షులు నాగేంద్రబాబు ధన్యవాదాలు తెలియజేశారు... ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బచ్చలకూరి కృష్ణ ప్రసాద్ , బ్లాక్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి వార్డు మెంబర్లు వరలక్ష్మి సతీష్ ,,కురు శ్రీను మరియు గ్రామ పెద్దలు ,,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీశ్రీశ్రీ సవరమ్మ అవ్వ దేవర సందర్భంగా కోలాట జంటను ఘనంగా సన్మానించారు...



**సికే న్యూస్ జోగులంబ గద్వాల జిల్లా కెమెరామెన్ బోయ కిష్టన్న.** జోగులంబ గద్వాల నియోజకవర్గ ధరూర్ గ్రామం ధరూర్ మండలం లో శ్రీశ్రీశ్రీ సవరమ్మ అవ్వ దేవర సందర్భంగా గోకుల కృష్ణ జంట కోలాట బృందం ధరూర్ గ్రామ చిన్నారులచే అగ్ని జ్వాలలతో అద్భుతమైన కోలాట ప్రదర్శన అమ్మవారి వేషధారణలో భక్తులను అబ్బుర పరచడం జరిగింది కన్నుల పండుగ మారిన ధరూర్ గ్రామం కోలాటం మాస్టర్ దేవ బండ బి పరమేష్ గారిని శాలువాలతో సన్మానించడం జరిగింది అలాగే మేనేజ్మెంట్ ముట్టేసావు జమ్మన్న అలాగే జాంపల్లి మాజీ జెడ్పిటిసి పద్మా రెడ్డి.

టి వెంకటేష్ రెడ్డి. గ్రామ సర్పంచ్ డి ఆర్ విజయ్ కుమార్. ఉప సర్పంచ్. అలాగే పటేల్ శ్రీనివాసులు. రంగస్వామి. కురువ కృష్ణ వారి . రాజు.ఆధ్వర్యంలో కోలాట కార్యక్రమం విజయవంతం అవ్వడం జరిగింది. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరుపుకోవాలని గ్రామస్తులు కోరారు

## ఆత్మకూర్ యం మండలంలో ఘనంగా బక్రీద్ పండుగ వేడుక ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసిన బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బీసుచందర్ గౌడ్



**సి కె న్యూస్ రిపోర్టర్ షేక్ అజీజ్ :**ఆత్మకూరు మండలంలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ ఎంతో ఘనంగా జరుపుకున్నారు ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు ముస్లిం సోదరులకు బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసినారు ముస్లిం సోదరి మణులకు బక్రీద్ పండుగ శు భాకాంక్షలు త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు శు భాకాంక్షలు తెలిపారు దైవాజ్ఞను అనుసరించి సమాజ హితం కోరి ప్రతి మానవుడు నిస్వార్థ సేవలను అందించాలని సందేశం బక్రీద్ మనకు అందిస్తుందని అన్నారు తమకు కలిగిన దాంట్లోంచి ఎంతో కొంత ఇతరులకు పంచడం అనే దాతృత్వ స్వభావాన్ని బక్రీద్ పండుగ ద్వారా నేర్చుకోవాలని అన్నారు అల్లా ఆశీస్సులతో ఆత్మకూరు ప్రజలు రైతులకు సకాలంలో వర్షాలు కురిసే సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా అల్లాను కోరుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో మజీద్ సదరు ఎండి అజీముద్దీన్ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు

## ప్రశాంతంగా ముగిసిన బక్రీద్ పండుగ ప్రార్థనలు



**సికే న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్:**కీసర సర్కిల్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, కాప్రా మండలం,జవహర్ నగర్ పరిధిలో ఆయా. ఈద్గా లలో బక్రీద్ పండుగ ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ది: 28-05-2026 బేస్తవారం రోజున వెంకటేశ్వర కాలనీలో షేక్ అహ్మద్,వికలాంగుల కాలనీలో సయ్యద్ ముబషీర్, ఎండి మొయినుద్దీన్, సయ్యద్. సైద్. అంబేద్కర్ నగర్ లో షేక్ అహ్మద్ భాష, ఎండి నూరుద్దీన్. మల్కారం లో ఎండి షాబుద్దీన్, ఫరానగర్ లో కరం ఖాన్, అరుంధతి నగర్ లో షేక్ సుల్తాన్, వైయస్సార్ నగర్ లో ఎండి జావీద్, ఎండి హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు ఎండి. పాషామియా,కార్యదర్శి కాలేష, ఎండి వహీద్,మహమ్మద్ షఫీ, షేక్ హబీబ్,అహీమ్ ఖాన్ సాబ్,టీ మస్తాన్, మహమ్మద్ సోహెల్,మహమ్మద్ మోహిత్, మొహమ్మద్ అజీమ్, ఎండి బషీర్ త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే ఈ పండుగ రోజున సమస్త మానవాళికి శాంతి చేకూరాలని. అల్లా అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి మంచి జరిగేలా కరుణించాలని ప్రార్థించడం జరిగింది. కార్యక్రమం ప్రశాంతంగా ముగిసేందుకు పూర్తిస్థాయిలో సహకరించిన పోలీస్ శాఖకు ధన్యవాదములు తెలియజేయడం జరిగింది.

## గ్రామపంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం





**సి కె న్యూస్ ఆత్మకూరు యం రిపోర్టర్ షేక్ అజీజ్ :**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని సర్వేపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ మరియు సిబ్బందికి ప్రతినెల ఒకటవ తేదీకి జీతాలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్యాబినెట్ మంత్రులకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. సర్వేపల్లి సర్పంచ్ కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ సరైన సమయానికి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇబ్బందులను అర్థం చేసుకొని పెద్ద మనసుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతినెల ఒకటవ తేదీన జీతాలు ఇస్తామని ప్రకటించడంతో చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ శాఖ అధ్యక్షులు,వార్డు మెంబర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ చేతిలో ఈ డి, సి బి ఐ కీలుబొమ్మలు.......!



- బిజెపి కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్ కి నిదర్శనమే పినరేయ్ విజయ్ పై ఈడీ దాడులు
- సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి
- పిన్నరై విజయ్ పై ఈడి దాడులకు నిరసనగా సిపిఐ ఎం ఆందోళన

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 28 :**మోడీ చేతిలో కేంద్ర దర్యాప్తు సంస్థలు కీలుబొమ్మలాగా మారాయని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి ఆరోపించారు. బిజెపి కాంగ్రెస్ అంతర్గత ఒప్పందానికి నిదర్శనగా పినరాయి విజయ్ పై జరిగిన ఈడి దాడులు స్పష్టంగా కనిపిస్తున్నాయని నర్సారెడ్డి అన్నారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరై విజయ్ పై జరిగిన ఈడి దాడులకు నిరసనగా భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో నర్సారెడ్డి మాట్లాడారు. ఇటీవల కేరళ ములో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ బిజెపి కుమ్మక్కై వామపక్ష ప్రభుత్వాన్ని ఓడించారని అన్నారు. దేశంలోనే నీతి నిజాయితీకి ప్రతిరూపంగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి విజయ్ పై ఈడి దాడులు సిగ్గుచేటని అన్నారు. కేంద్రంలో ఉన్న ఇండియా కూటమి కేరళ ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ రెండు ఒకటై సిపిఐ ఎం నాయకులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కేరళ చరిత్రలోనే గతంలో ఎన్నడు లేని విధంగా రెండుసార్లు ముఖ్యమంత్రిగా పరిపాలించిన ఘనత పినరై విజయ దక్కుతుందని అన్నారు. సిపిఐ ఎం నాయకత్వంలో పది సంవత్సరాలు కేరళని పరిపాలించిన విజయ్ దేశంలోనే పేదరికం లేని రాష్ట్రంగా కేరళని తీర్చిదిద్దారని అన్నారు. బిజెపి కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పండిన కేరళలోని ఎల్డీఎఫ్ కూటమి ప్రజల విశ్వాసం చెక్కుచెదరని అన్నారు. పినరై విజయ్ పై ఈడి దాడులు జరుగుతున్న సమయంలో ఎటువంటి పిలుపులు లేకుండానే వేలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి కేంద్ర దర్యాప్తు సంస్థలపై నిరసనకు దిగారని అన్నారు. కేరళలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ పోలీసులతో ప్రజల ఆందోళనను అణిచివేయాలని లాటించార్జి సైతం చేశారని నర్సారెడ్డి విమర్శించారు. గతంలో ఈ డి సి బి ఐ సంస్థల ద్వారా దాడులు చేపించి అవినీతి పేరుతో లొంగ తీసుకున్న అస్సాం పశ్చిమబెంగాల్ నాయకులను ఇప్పుడు ముఖ్యమంత్రులు చేసిన ఘనత బిజెపికి దక్కుతుందని అన్నారు. ఎంతటి అవినీతి ఆరోపణలు వచ్చిన పట్టుబడిన బిజెపి వాషింగ్ మిషన్ ద్వారా పరిశుద్ధులను చేయటం బిజెపికి అలవాటేనని నర్సారెడ్డి ఎద్దేవా చేశారు. దేశంలో బిజెపి అనుసరిస్తున్న యువజన ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన యువత కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ముందుకు వస్తున్నారు అని అన్నారు. భవిష్యత్తులో కాక్రోజ్ జనతా పార్టీ వంటి యువజన ఉద్యమాలతో బిజెపికి గడ్డు కాలం తప్పదని నర్సారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి ఉస్తేల జ్యోతి కుంజ శ్రీను ధనకొండ రాఘవయ్య కొరడా శ్రీనివాస్ చాట్ల శ్రీను భూపేందర్ కనక శ్రీ 20వ వార్డు మెంబర్ ఇరప అనసూర్య ఎస్ఎఫ్ఐ నాయకులు రవీందర్ శాఖ కార్యదర్శి డి రామకృష్ణ కాక రమణ సౌభాగ్యం తదితరులు పాల్గొన్నారు

## షాద్ నగర్ లో ఘనంగా ఎన్టీఆర్ 103 వ జయంతి వేడుకలు



- షాద్ నగర్ బస్టాండ్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం.
- ఎన్టీఆర్ ఓ యుగ పురుషుడు, ఆయనకు భారత రత్న పురస్కారం ఇవ్వాలి
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైత్రీవనంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం శుభసూచకం.
- కమ్మ సేవా సమితి డివిజన్ అధ్యక్షులు పాతూరి వెంకట్రావు

**సి కే న్యూస్ షాద్ నగర్ : మే 28:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ పరిధిలోని ఎంపీ శేషయ్య నగర్ కమ్యూనిటీ హాల్ నందు 103 వ జయంతి వేడుకలను షాద్ నగర్ కమ్మ సేవా సమితి అధ్యక్షులు పాతూరి వెంకటరావు ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం షాద్ నగర్ బస్టాండ్ ఆవరణలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 1100 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమ్మ సేవా సమితి షాద్ నగర్ డివిజన్ అధ్యక్షులు పాతూరి వెంకట్రావు మాట్లాడుతూ.. తెలుగునేల పులకించి పోయే తెలుగు బిడ్డ, తెలుగు ప్రజలందరి చేత అన్నగారు అనిపిలిపించుకున్న మహానేత, దక్షిణ భారతదేశంలో పుట్టిన ముద్దుబిడ్డ చరిత్ర మరువని యుగపురుషుడు మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు అని తెలుగు నేల ఉన్నంత వరకూ ఆయన చిరస్మరణీయుడనీ, తెలుగు వారి సామాజిక రాజకీయ జీవనంలో ఎన్టీఆర్‌ది ఓ కీలక ఘట్టం అనీ ఆ మహానాయకుడి శత జయంతి ఉత్సవాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకుంటున్నారనీ కొనియాడారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి ఆయన చేసిన గొప్ప సేవలను తెలుగు ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని కొనియాడారు. ఆయన ఆలోచనలు అజరామరం.. ఆయన నాయకత్వం అద్భుతాల నిలయం.. ఆయన దారి అనితరసాధ్యం.. అంటూ కీర్తించారు. భారతీయ సినిమాపైనే కాకుండా దేశ రాజకీయాల్లోనూ చెరగని ముద్రవేసి తనదైన చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించుకున్న మహనీయుడు ఎన్టీఆర్ అనీ, కృషి ఉంటే మనుషులు రుషులవుతారనే పదానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచి చరిత్రలో యుగ పురుషుడిగా నిలిచిపోయిన ఎన్టీఆర్ శత జయంతి అందరికీ పండగ లాంటిదని అన్నారు. ఆయనకు గౌరవ ప్రదమైన భారత రత్న పురస్కారం ఇవ్వాలి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం నాడు అమీర్పేట మైత్రీవనంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆవిష్కరించటం సంతోషంగా ఉందని , కమ్మ సేవా సమితి తరుపున ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి నాయకులు బండారుపల్లి నాగేశ్వర రావు, కొర్రపాటి శ్రీనివాస్ రావు, పాతూరి సత్యనారాయణ, పినపాక ప్రభాకర్ , గుదే వసంత రావు, పాతూరి బ్రహ్మయ్య , వట్టికొండ ఎర్రయ్య, మక్కపాటి మల్లేశ్వర రావు, నువ్వుల నాగేశ్వరరావు, ఆలపాటి పూర్ణ, కొడాలి సురేష్, కృష్ణారావు, కిలారు సాంబయ్య, సంజీవ రావు, ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, కట్టా అప్పారావు, గుదే మస్తాన్ రావు, మలినేని శ్రీను , కట్టా హరి, కొత్త ప్రభాకర్, కొర్రపాటి శ్రీనివాస్, జొన్నలగడ్డ శ్రీనివాస్, యడ్ల శ్రీనివాస్ , కట్టా హరి, బొల్లినేని కోటేశ్వర్ రావు, పేరం అనిల్ , కనుమూరి రమేష్, కొర్రపాటి వెంకట్రావు, ఆలూరి శ్రీనివాస్, బ్రహ్మయ్య చౌదరి, మాధవ రావు. బాలయ్య, వెంకటేశ్వర రావు . నువ్వుల నాగేశ్వరావు, నువ్వుల వెంకటేశ్వర రావు , శశి, పాతూరి రఘు, పాతూరి విద్యాసాగర్, మక్కపాటి సతీష్ , సిరిపురపు వెంకటరమణ, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయ కక్షతో.. పంట పొలాలను,మోటర్లను కాల్చివేత.

పరిశీలించిన చింతకాని మండల కాంగ్రెస్ నాయకులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**టిఆర్ఎస్ నాయకుల ఆగడాలకు హద్దు, అదుపు లేకుండా పోతుందని రాష్ట్ర నాయకులు ట్రైన్ లు, ప్రభుత్వ ఆఫీసులను కాల్చి వేయాలని పిలుపునిస్తుంటే... వారి మాట తూచా తప్పకుండా మండలంలోని టిఆర్ఎస్ నాయకులు పంట పొలాన్ని మోటార్లను కాల్చి వేస్తున్నారని చింతకాని మండల నాయకులు దుయ్యబట్టారు.

వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని తిర్లాపురం గ్రామానికి చెందిన బండి వీరయ్య తండ్రి( పరమయ్య ) మొక్కజొన్న పంట పొలాన్ని, మరియు డ్రిప్ పైపులను బి ఆర్ఎస్ నాయకులు రాజకీయ కక్షతో..పొలానికి నిప్పంటించి.సుమారు రెండు లక్షల 50 వేలు పైగా ఆస్తి నష్టం చేసారు అని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.ఇలాంటి దుశ్చర్యలుకు పాల్పడటం టిఆర్ఎస్ నాయకులకు తగదని మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. దీనిపై పోలీసు వారు వెంటనే విచారణ చేసి దోషుల్ని కఠినంగా శిక్షించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో... మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నె బోయిన గోపి యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవింద రావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, పాతర్లపాడు మాజీ ఎంపీటీసీ బొర్రా ప్రసాద్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంచుమర్తి రామకృష్ణ, మండల సేవాదళ్ అధ్యక్షులు పరసగాని సతీష్,గ్రామ శాఖ అధ్యక్షులు. బండి వీరయ్య, గోద వెంకటేశ్వర్లు,బండి భూషి, చింతల రామారావు,బండి వెంకటేశ్వర్లు,బండి లక్ష్మీపతి, చింతల వెంకటేశ్వర్లు,బండి ఉదయ్,తదితరులు, పరిశీలించారు.

## ప్రఅకాల వర్షాలతో తడిసినా ధాన్యం కొంటాం.

- జిల్లా కలెక్టర్ అంకిత్
- మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యమైతే చర్యలు
- రవాణా సమస్యల పరిష్కారానికి శాఖల సమన్వయం




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 28,**ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

రవాణా, రెవెన్యూ శాఖల సమన్వయంతో అన్ని రకాల వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగిస్తున్నామని, ప్రతి రైస్ మిల్లుకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లను నియమించి, అదనపు హమాలీలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రస్తుత అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక అలర్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసిందని తెలిపారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసినా రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని స్పష్టం చేశారు.

రెవెన్యూ, సివిల్ సప్లై, రవాణా శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

## సీతంపేట గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుపంపిణీ.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు సీతంపేట గ్రామనికి చెందిన షైక్ షామినాకి మంజూరైనా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్ సుమారు 30,000/-రూపాయల చెక్ ను పంపిణి చేసిన గ్రామ సర్పంచ్ ఆళ్ల మణి - పానకాలరావు, శాఖ అధ్యక్షులు కొత్తపల్లి బసవయ్య, ఉపాధ్యక్షులు నారపోగు మల్లయ్య. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ నారపోగు వెంకటేశ్వర్లు, పణితి జయరాజు,బయ్యన నరేష్,జాల శ్రీనివాసరావు, యరగాని వెంకటేశ్వర్లు,షైక్ హుస్సేన్, కొత్తపల్లి ఏడుకొండలు,షైక్ దరియా,చంద్రకాని శ్రీను మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## సారగండ్లగూడెం గ్రామంలో పోక్సో చట్టం గురించి అవేర్నెస్ ప్రోగ్రాం



**సి కె న్యూస్ ఆత్మకూరు యం రిపోర్టర్ షేక్ అజీజ్ :**మహిళా వారోత్సవాలు సందర్భంగా ఆత్మకూరు మండలం సారగండ్ల గూడెం గ్రామంలో పనిచేసే ప్రదేశంలో మహిళలను కలిసి మహిళలపై జరుగుతున్న అత్యాచారాల గురించి 2013 ఫోక్సో చట్టం గురించి అవేర్నెస్ ప్రోగ్రాం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సెక్టార్ సూపర్వైజర్ జీ వాణిశ్రీ మేడం గ్రామ సర్పంచి సారగండ్ల చలమయ్య అంగన్వాడీ టీచర్ సునీత మరియు మహిళలు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగిందిద

## ఘనంగా నాగులవంచ లో ఎన్టీఆర్ జయంతి.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**నాగులవంచాలోని బైపాస్ రోడ్ లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎన్టీఆర్ అభిమానులు పూలదండలు వేసి ఘనంగా గా నివాళులు అర్పించిచారు.అనంతరం పులిహోర పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏటుకూరి రవి,కొమ్మినేని వెంకటేశ్వర్లు, సామినేని బాబూరావు,పసుపులేటి శ్రీను,నెల్లూరు రమేష్,కంచర్ల తిరపయ్య,అంబటి శాంతయ్య, కన్నేటి శ్రీరామ్,అంబటి సాకేత్, కప్పల పాండు, బైరు రామమూర్తి,మంద నాగేశ్వరావు,బల్లి శాసయ్య, కందిమల్ల పుల్లయ,అనగాని శ్రీను,ఆలస్యం రామారావు,కాసాని మహేష్, బైరు వెంకటకుమార్,జొన్నలగడ్డ సుధాకర్,ధర్మపురి కోటయ్య,వంకాయలపాటి కల్యాణ్, షేక్ నాగులమేర. తదితరులు పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ పంపిణి చేసిన నాయకులు

- ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా ప్రభుత్వం
- మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**మహబూబాబాద్/ కొత్తగూడ ,సి కే న్యూస్ మే 27:::**కొత్తగూడ మండలం మైలారం గ్రామానికి చెందిన గుగులోత్ తాకిర్యకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.?ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, సుంకరబోయిన మొగిలి, రూప్ సింగ్, మరియు జీచీజ అధ్యక్షులు మల్లెల రణధీర్ లు చెక్కును పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..., నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. మంత్రి సీతక్క చొరవతోనే ఈ సహాయం సకాలంలో బాధితులకు అందిందని వారు తెలిపారు.
?ఈ కార్యక్రమంలో వల్లపు రంజిత్, బోడ ఈర్య, బానోతు ఈర్య, కుమార్, ప్రశాంత్ రెడ్డి, బానోత్ కళ్యాణ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ద

## మే నెలలో వచ్చే అకాల వర్షాలకు మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు:-

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**సురక్షిత ప్రాంతాలు: అకాల వర్షాలతో పాటు తరచుగా పిడుగులు పడే అవకాశం ఉంటుంది. కాబట్టి వర్షం, ఉరుములు వచ్చేటప్పుడు చెట్ల కింద, కరెంట్ స్తంభాల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో నిలబడకూడదు. వెంటనే కాంక్రీట్ భవనాల్లోకి వెళ్లాలి.
?విద్యుత్ పరికరాల పట్ల జాగ్రత్త: ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల ప్లగ్‌లను తీసివేయండి. తడి చేతులతో స్విచ్‌లను తాకవద్దు.

# రూ.1.50కోట్లతో చింతల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు.

- చెరువును మరింత ఆధునీకరించి, సుందరంగా తీర్చిదిద్దుతాం.
- ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా ప్రణాళికలు.
- చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 28,** చుంచుపల్లి మండల, విద్యానగర్ పంచాయతీ పరిధిలోని చింతల చెరువు చుట్టూ రూ.1.50కోట్లతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి జరుగుతోందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపి అనుమతులు మంజూరు చేయించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం ఆయన చింతల చెరువును క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతల చెరువును మరింత ఆధునీకరించి, అద్భుతంగా సుందరీకరిస్తామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఎంతగానో ఉపయోగపడే విధంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. స్థానికులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, సర్పంచి శాంతి శ్రీ, భాగం నాగమణి, మాధవరావు, తాటి కృష్ణవేణి, ఏపూరి కృష్ణమూర్తి, కె రామారావు, కృష్ణ, నర్సింహారావు, సురేష్, గంగయ్య, భద్రం, ప్రసాద్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## తిర్లాపురం గ్రామంలో ఈదురుగాలుల - బీభత్సం కూలిన విద్యుత్ స్తంభాలకు మరమ్మత్తులు



**చేపించిన గ్రామ సర్పంచ్ చాపలమడుగువీరబాబు.**

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండల పరిధిలో తిర్లాపురం గ్రామం లో మే 27 తేదీన బుధవారం నాడు రాత్రి ఈదురుగాలుల - బీభత్సం తో వచ్చిన వర్షముతో మత్కేపల్లి నామవరం వెళ్లే రోడ్డుకు కరెంటు పోల్స్ విరిగిపడిన ఉన్న తీగలు తెగి రోడ్డు మీద అడ్డంగాపడటంవల్ల వాహనాలకు రాకపోకలు అంతరాయం కలిగినది. రోడ్ల ఇరువైపులా ఉన్న భారీ చెట్లు విరిగి రోడ్డు మీద పడి ఉన్నాయి. దీనితో తిర్లాపురం గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలుల వల్ల విద్యుత్ తీగలు తెగి రోడ్లపై పడటం అత్యంత ప్రమాదకరం. ఇలాంటి పరిస్థితిలో ప్రాణాపాయం జరగకుండా ఉండటానికి తక్షణమే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందజేసి అకాల వర్షాల కారణంగా విరిగిపడిన విద్యుత్ స్తంభాలను, తెగిపడిన తీగలను తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తక్షణమే స్పందించి మత్కేపల్లి నామవరం వెళ్లే రోడ్డుకు కరెంటు తీగలు, భారీ వృక్షాలు అడ్డంగా జెసిబి సహాయం తొలగించి వాహనాలు వెళ్లే విధంగా మరమ్మత్తులు చేయించారు. దీనివల్ల గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగి, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ప్రజల ఇబ్బందులను తొలగించి, గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబుకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చేపల మడుగు వీరబాబు, నాగులవంచ ఏ ఈ సాయి శ్రీధర్, సామల రమేష్, విద్యుత్ కాంట్రాక్టర్ రామకృష్ణ సిబ్బంది, ఫ్రాన్సిస్, అన్వేష్, సీత రాములు, తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి,భక్తికి ప్రతీకగా నిలిచేదే బక్రీద్



**ముస్లిం మత పెద్దలు గురువులు**
**ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు.**
**పొద్దుటూరు గ్రామంలో ఈద్గాలో సమాజ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు**

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం పొద్దుటూరు త్యాగానికి,భక్తికి ప్రతీకగా నిలిచేదే బక్రీద్ పండుగ అని ముస్లిం పెద్దలు అన్నారు.ఈద్-ఉల్-అజా' (బక్రీద్) పండుగను పురస్కరించుకొని పొద్దుటూరులోముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో,ఘనంగా జరుపుకున్నారు.ప్రవక్త ఇబ్రహీం చేసిన గొప్ప త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ రోజున ప్రత్యేక ప్రార్థనలు,ఖుర్బానీలు సమర్పించారు.ఇక మధిర ఈద్గాలో గురువారం ఉదయం ఈద్ నమాజును నిర్వహించారు.పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు సోదరీమణులు పాల్గొని సమాజ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.పండుగ సందర్భంగా ఈద్గాలో ముస్లిం మత పెద్దలు ఆధ్యాత్మిక .. బక్రీద్ అనేది త్యాగానికి, సమాజ ఐక్యతకు ప్రతీక అన్నారు.మానవత్వాన్ని, సహాయసహకారాన్ని నేర్పే పండుగ అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరు రాగద్వేశాలు వీడనాడి సామరస్యా భావాలతో కలిసి మెలిసి జీవించటంతో సమాజంలో శాంతిని ఏర్పడుతుందని అన్నారు.

## రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కుని కలిసిన చిన్నమండవ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**
ఉపముఖ్యమంత్రివర్యులు శ్రీ మల్లు భట్టివిక్రమార్కని ఖమ్మంలోని వారి క్యాంపు కార్యాలయంలో చిన్నమండవ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరీదు రామకృష్ణ గౌడ్ మరియు కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి గ్రామంలో ఉన్న పేద్దచెరువులో ఉన్న నీటిని చేపల వేటకొరకు మాత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు నీటిని అక్రమంగా విడుదల చేస్తున్నారని పలుమార్లు అధికారులకు తెలియచేసిన వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని, భట్టిగారికి తెలియజేసారు వారు వెంటనే స్పందించి నేను వారికీ మొన్ననే నీటిని ఎవరు అక్రమంగా నిరూపయోగంగా విడుదల చేయొద్దని హెచ్చరిచాను మరల అదే పనిజరిగితే అలాంటి వ్యక్తులపై పిడియాక్ట్ కేసులు కూడా పెట్టమని తెలియపరిచారు, అలాగే మాత్స్య శాఖ సొసైటీ లో గల అవినీతి గురించి సభ్యులకు ఇవ్వవలసిన వాటాలు, చేపలు ఇవ్వడం లేదు అని వివరించారు,ఈ సమస్యల అన్నీటిపై విచారణ జరపాలని చేపల ాాణ కి గట్టిగా చెప్పారు. ఈ కార్యక్రమంలో నిమ్మతోట ముత్తయ్య, డోకుపర్తి గోపాలరావు, కాశీమాల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# గణపవరంలో మహానాడు 2026 ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులు.. పార్టీ జెండా ఆవిష్కరణ

**సి కే న్యూస్** పల్నాడు జిల్లా గణపవరంలో తెలుగుదేశం పార్టీ వార్షిక పండుగ మహానాడు 2026 మహోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట శాసనసభ్యులు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. ఆంధ్రుల అభిమాన ఆరాధ్యుడైన స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, రాబోయే రోజుల్లో ప్రతిపక్ష పార్టీకి స్థానం లేని విధంగా చేస్తారు. ప్రజల పక్షాన పోరాటాలు చేసిన కార్యకర్తలను ఎప్పటికీ తెలుగుదేశం పార్టీ మర్చిపోదని మరోసారి గుర్తు చేశారు. తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు ఆయన ఆశయాల అనుగుణంగా పనిచేస్తున్న నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో లోకేష్ యువశక్తితో తెలుగుదేశం పార్టీ ముందుకు దూసుకుపోతూ అత్యద్భుతమైన ఫలితాలతో ప్రజల మనసులను దోచుకుంటున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాట్రు శ్రీనివాసరావు , సొసైటీ చైర్మన్ పెంట్యాల , శేషగిరి రావు , పెడవల్లి రామయ్య , రాయపాటి పెదరామయ్య , మాలంపాటి లక్ష్మీనారాయణ రావు , కార్యకర్తలు తెలుగు తమ్ముళ్లు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు ఇన్చార్జిలు అనుబంధ సంఘాల నాయకులు అభిమానులు సానుభూతిపరులు పాల్గొని అన్నకి ఘనంగా నివాళులర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంపాదకీయం

## సలహాలు చాలవు!

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి మధ్య ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఏడు విజ్ఞప్తులు చేశారు. స్వదేశీ ఉత్పత్తుల కొనుగోలు, ఇంధన పొదుపు, అనవసర విదేశీ ప్రయాణాల నియంత్రణ, దేశీయ పర్యాటక ప్రాధాన్యత, స్వదేశీ ఆవిష్కరణల ప్రోత్సాహం, వీలైనచోట ఇంటినుంచి పని (వర్క్ ఫ్రమ్ హోం), మితవ్యయం, ఆత్మనిర్భరత వంటివి వీటి సారాంశం. ఈ పిలుపులపై రాజకీయ పక్షాలు, ఆర్థికవేత్తలు, వ్యాపార వర్గాలు, సామాన్య ప్రజలనుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. చీలికలు ఏర్పడిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశ సహజ సామర్థ్యాన్ని, తట్టుకునే శక్తిని పెంచేందుకు దేశీయ వినియోగాన్ని ప్రోత్సహించడం, బాహ్య ఆధారపడటాన్ని తగ్గించడం అవసరమని కొందరు సమర్థిస్తుండగా; ఇవి ఆరోగ్యకరమైన, పర్యావరణ హితమైన జీవనశైలులకు దోహదం చేస్తాయని సామాజిక రంగంలోని కొందరు భావిస్తున్నారు. ఇందులో నిజం లేకపోలేదు. భారత్ సహా ప్రతి దేశం మరింత అనిశ్చిత ప్రపంచ వాతావరణానికి సన్నద్ధం కావాల్సిందే. అయితే, ఈ విజ్ఞప్తులను నిశితంగా పరిశీలిస్తే -అవి ప్రధానంగా పౌరుల ప్రవర్తనను మార్చడంపైనే దృష్టి సారిస్తూ, ప్రభుత్వాలను, వ్యవస్థలను సమానమైన బాధ్యతనుంచి దాదాపుగా దూరంగా ఉంచుతున్నాయన్నది గమనార్హం. తద్వారా నిర్మాణాత్మక సంక్షోభాలను నిర్వహించే భారం రాజ్యంనుంచి సూక్ష్మంగా వ్యక్తుల భుజాలపైకి జారుతోంది.

ఆధునిక ప్రజాస్వామ్య పాలన ఒక అంతర్లీన సామాజిక ఒప్పందంపై ఆధారపడి ఉంటుంది. పౌరులు పన్నులు చెల్లిస్తారు. చట్టాలను పాటిస్తారు. ప్రజాస్వామ్యంలో పాల్గొంటారు. ఆర్థిక వ్యవస్థకు తోడ్పడతారు. ప్రతిగా ప్రజారోగ్యం, సామాజిక భద్రత, మౌలిక సదుపాయాలు, విద్య, ఆర్థిక స్థిరత్వం, వ్యూహాత్మక సన్నద్ధతవంటివి ప్రభుత్వాల కర్తవ్యం. ప్రజలకు సలహాలివ్వడానికే కాదు, సంక్షోభాలను తట్టుకునేంత పటిష్ఠమైన వ్యవస్థలను నిర్మించడానికే ప్రభుత్వాలు. కానీ ఎన్నికల హామీలు సైతం పాక్షికంగా అమలై, మళ్లీ తదుపరి ఎన్నికలకు కొత్త ప్యాకింగ్‌లో తిరిగి వచ్చే పరిస్థితిలో -ఈ ఒప్పందం తరచూ నెరవేరడం లేదు. నిర్మాణాత్మక ఆర్థిక లేదా భౌగోళిక రాజకీయ అఘాతాలను ఎదుర్కొన్నప్పుడు, తదనుగుణమైన వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టకుండానే, "త్యాగం చేయండి, తట్టుకోండి" అని ఎన్నికైన ప్రభుత్వాలు పౌరులను కోరడం పెరిగితే, సామాజిక ఒప్పందం బలహీనపడటం మొదలవుతుంది. ఈ ధోరణి భారత్‌కే పరిమితం కాదు. ద్రవ్యోల్బణం, వాతావరణ ఒత్తిడి, ఇంధన అభద్రత, ఆర్థిక మందగమనంవంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రపంచ ప్రభుత్వాలన్నీ వినియోగం తగ్గించమని, విద్యుత్ పొదుపు చేయమని, మితవ్యయం పాటించమని పౌరులను కోరుతున్నాయి. వ్యక్తిగత ప్రవర్తన ముఖ్యమే; కానీ ఇలాంటి పిలుపులు తరచూ వ్యవస్థాగత ఫలితాలను రూపొందించడంలో రాజ్యాలకు, కార్పొరేట్లకు ఉన్న చాలా పెద్ద బాధ్యతను కప్పిపుచ్చుతాయి. ప్రతీకాత్మక ఐక్యత సంఘీభావాన్ని కలిగించవచ్చు గానీ, వ్యవస్థాగత సన్నద్ధతకు అది ప్రత్యామ్నాయం కాజాలదు. ఆహార భద్రత, వాతావరణ మార్పు, ఆర్థిక వ్యవస్థలు, సాంకేతిక పర్యావరణాలు -అన్నీ జాతీయ సరిహద్దులను దాటి విస్తరించిన ఈ అత్యంత పరస్పర అనుసంధానిత ప్రపంచంలో, కేవలం "ప్రవర్తనా జాతీయవాదం" ద్వారా ఏ దేశమూ తనను తాను రక్షించుకోలేదు. సంక్లిష్టమైన నిర్మాణాత్మక సవాళ్లను పౌరుల నైతిక బాధ్యతలుగా సరళీకరించడంలోనే అసలు ప్రమాదం ఉంది. దేశభక్తి ఎంత భావోద్వేగపూరితమైనా, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికను, వ్యవస్థాగత సామర్థ్యాన్ని, విధాన సమగ్రతను భర్తీ చేయలేదు. ఇక్కడ ఒక అసౌకర్యకరమైన అసమతుల్యత ఉంది: పౌరులు పొదుపు చేయాలని, సర్దుకుపోవాలని, ఆత్మనిర్భరులవ్వాలని పదేపదే సలహా ఇవ్వబడుతుంది; మరి పారదర్శకత, నియంత్రణ స్థిరత్వం, ప్రజా పెట్టుబడి, వ్యవస్థాగత సంస్కరణలపట్ల ప్రభుత్వాలు ఎందుకు సమానమైన ప్రతిజ్ఞలు చేయడం లేదు? అందుకే, సంక్షోభ సమయంలో పౌరులు ప్రభుత్వం కోసం ఏం చేయాలన్న ప్రశ్నకంటే -ప్రపంచ అస్థిరత సమయంలో ప్రభుత్వాలు పౌరుల కోసం ఏం చేయాలన్నదే మరింత మౌలికమైన ప్రజాస్వామిక ప్రశ్న. ఈ ఏడు విజ్ఞప్తులను పౌర-కేంద్రిత దృక్కోణం నుంచి తిరిగి రాస్తే ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోతాయి. మొదటిది, సామాజిక భద్రతా వ్యవస్థల్లో ప్రభుత్వాలు మరింత గంభీరంగా పెట్టుబడి పెట్టాలి. కోవిడ్ మహమ్మారి నిరూపించినట్లు, తట్టుకునే సమాజాలు క్రమశిక్షణ గల పౌరులతో మాత్రమే కాక, బలమైన ప్రజా వ్యవస్థలతో నిర్మితమవుతాయి. రెండోది, లక్షలాది మంది ఆర్థిక అభద్రతలో, నిరుద్యోగంలో, తగిన రక్షణలేని అసంఘటిత-గిగ్ కార్మిక వ్యవస్థల్లో చిక్కుకుని ఉన్నప్పుడు, "వినియోగ దేశభక్తి"పైనే అతిగా ఆధారపడకుండా పెరుగుతున్న ఆర్థిక అసమానతలను ప్రభుత్వాలు ఎదుర్కోవాలి. మూడోది, ప్రయోగశాలలు, వర్శిటీలు, తయారీ పర్యావరణాలు, శాస్త్రీయ దృక్పథం, ఆవిష్కరణ సామర్థ్యంలో దశాబ్దాల పెట్టుబడి ద్వారానే నిజమైన ఆత్మనిర్భరత సాధ్యం. ఐవీ లీగ్ క్యాంపస్‌లను దేశంలో నెలకొల్పడం సరిపోదు, భారతీయ సంస్థలే ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రాలుగా ఎదగాలి. నాలుగోది, సంక్షోభ సమయంలో నమ్మకమే వ్యూహాత్మక జాతీయ సంపద కనుక, ప్రభుత్వాలు పారదర్శకతను, ప్రజావిశ్వాసాన్ని పెంచాలి. ఆరోది, వ్యాపారవేత్తలు, కార్మికులు, పరిశోధకులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం స్థిరమైన, న్యాయమైన విధాన వాతావరణాన్ని ప్రభుత్వాలు కల్పించాలి. ఏడోది, విమర్శను "దేశద్రోహం"గా ముద్ర వేయడం కాకుండా, బహిరంగ చర్చ, వ్యవస్థాగత విమర్శ, మేధో వైవిధ్యం, ప్రజాస్వామిక సరిదిద్దుబాటు ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి.

ప్రభుత్వాలు కేవలం ప్రవర్తనా సలహాలిస్తూ, నిర్మాణాత్మక బలహీనతల పర్యవసానాలను పౌరులే భరించాల్సి వస్తే, ప్రజాస్వామ్యాలు సుస్థిరంగా మనజాలవు. "ప్రవర్తనా రాజకీయాల" అతిపెద్ద ప్రమాదం ఏమిటంటే -అది వ్యవస్థాగత వైఫల్యాన్ని సాధారణమైనదిగా చేసేస్తుంది. వ్యక్తిగత బాధ్యత -నిర్మాణాత్మకమైన సమస్యలకు పరిష్కారం కాకూడదు. ప్రధాన ఆర్థిక, భౌగోళిక, రాజకీయ శక్తిగా ఎదగాలన్న భారత ఆకాంక్షను సాకారం చేసుకోవాలంటే -ప్రభుత్వాలే ఎక్కువ బాధ్యత స్వీకరించే నవీకృత సామాజిక ఒప్పందం అవసరం. సంక్షోభ సమయంలో నాయకత్వానికి అసలైన పరీక్ష -పౌరులు ఎంత త్యాగం చేస్తారన్నది కాదు; పౌరులను రక్షించేందుకు అవసరమైన జవాబుదారీతనాన్ని, విధాన గాంభీర్యాన్ని ప్రభుత్వాలు ప్రదర్శిస్తాయా లేదా అన్నదే. సలహాలకంటే వ్యవస్థల పటిష్ఠతే అసలైన జాతీయ శక్తి!



## 'అబ్రహాం'చుట్టూ కొత్త యుద్ధం!

ఇరాన్ డీల్‌ను అబ్రహాం ఒప్పందాలతో ముడిపెడుతూ ట్రంప్ గల్ఫ్ దేశాలపై ఒత్తిడిని తీవ్రతరం చేశారు. యుద్ధం ముగింపునకు చేసుకునే ఏ ఒప్పందంలోనైనా సౌదీ అరేబియా, ఖతార్, పాకిస్థాన్, తుర్కియే, ఈజిప్ట్, జోర్డాన్ వంటి దేశాలు ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు సాధారణీకరించే అబ్రహాం ఒప్పందాలపై సంతకాలు చేయడం "తప్పనిసరి" కావాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా సౌదీ అరేబియా, ఖతార్ "వెంటనే" సంతకాలు చేయాలని, మిగతా దేశాలు వాటిని అనుసరించాలని కోరారు. చేయని దేశాలు "చెడు ఉద్దేశాన్ని" ప్రదర్శించినట్టేనని, వాటిని ఈ ఒప్పందంలో భాగం చేయబోమని హెచ్చరించారు. 2020లో యూఏఈ, బహ్రెయిన్ తొలుత ఈ ఒప్పందాల్లో చేరగా, ఇటీవల కజఖ్‌స్థాన్ కూడా వీటిలో చేరుతున్నట్టు ప్రకటించింది. చివరకు ఇరాన్ సైతం ఈ ఒప్పందాలపై సంతకం చేయవచ్చని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

అయితే ట్రంప్ ప్రతిపాదనకు బలమైన ప్రతిఘటనే ఎదురైంది. ఈ డిమాండ్‌ను పాకిస్థాన్ తోసిపుచ్చింది; దీనికి కట్టుబడాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేసింది. పాలస్తీనా రాజ్య ఏర్పాటుకు స్పష్టమైన, మార్చులేని మార్గం ఏర్పడకుండా ఇజ్రాయెల్‌తో సంబంధాల సాధారణీకరణ సాధ్యం కాదని సౌదీ అరేబియా తన వైఖరిని పునరుద్ఘాటించింది. గత ఏడాది ఇజ్రాయెల్ వైమానిక దాడికి గురైన ఖతార్ సైతం ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యల తీవ్రత నేపథ్యంలో ఈ ముస్లిం దేశాల్లో ప్రజల్లో అపనమ్మకం అధికంగా ఉండటంతో సానుకూల స్పందన వచ్చే అవకాశం తక్కువేనని విశ్లేషకులు భావిస్తున్నారు. 2020 నాటి మధ్యప్రాచ్యానికి, నేటి పరిస్థితులకు మధ్య చాలా వ్యత్యాసం ఉందని వారు అంటున్నారు. ఇస్లాం పుట్టినిల్లుగా, మక్కా--మదీనా అనే రెండు పవిత్ర క్షేత్రాలకు సంరక్షకురాలిగా ఉన్న సౌదీ అరేబియాకు ఇజ్రాయెల్‌ను గుర్తించడమనేది కేవలం దౌత్య మైలురాయికి మించిన సున్నితమైన అంశం. గాజాలో సగానికి పైగా భూభాగాన్ని, దక్షిణ లెబనాన్‌లో గణనీయ ప్రాంతాన్ని ఇజ్రాయెల్ ఆక్రమణలో ఉంచుకున్నంత కాలం సౌదీ తన వైఖరిని మార్చుకునే అవకాశం లేదని, సౌదీ కదలనంత వరకు పాకిస్థాన్, ఖతార్ వంటి ఇతర దేశాలు కూడా ముందుకు రావని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ ఒప్పందంపై ఆయా దేశాలు సంతకాలు చేసే విధంగా పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తదితరులు చర్చల్లో పాల్గొంటున్నారు. 2020లో అబ్రహాం ఒప్పందాలను కుదర్చడంలో కుష్నర్ కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో ఈ చర్చల్లో ఆయన ప్రమేయానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఇస్లామాబాద్ వేదికగా జరగనున్న కీలక చర్చలకు వీరే నేతృత్వం వహించనున్నారు. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ చర్చల అనంతరం ట్రంప్ నాయకత్వాన్ని, సంభాషణలపై ఆయన నిబద్ధతను ప్రశంసించగా, ఒప్పందం అమలు దశలో అన్ని విధాలా సహకరించేందుకు తాము సిద్ధమని తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్ పేర్కొన్నారు. మొత్తంగా జలసంధి వద్ద ఉద్రిక్తతలు, చర్చల్లో అనిశ్చితి కొనసాగుతుండటంతో పశ్చిమాసియాలో శాంతి ఇంకా ఒక ప్రశ్నార్థకంగానే మిగిలింది. రాబోయే రోజుల్లో ఇస్లామాబాద్ చర్చల ఫలితం, ఇరాన్ స్పందన, గల్ఫ్ దేశాల వైఖరి ఈ యుద్ధ ముగింపు దిశను నిర్ణయించనున్నాయి. ఒకవైపు దౌత్య ప్రయత్నాలు, మరోవైపు హర్మూజ్ వద్ద కొనసాగుతున్న సైనిక చర్యలు ఈ పెళుసైన కాల్పుల విరమణ ఎంతకాలం నిలబడుతుందనే సందేహాన్ని మరింత పెంచుతున్నాయి.

# మరి.. విపక్షాల వణుకు దేనికి!?



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -ఎస్ఐఆర్) ప్రక్రియపై దేశంలో నెలల తరబడి సాగిన వాద ప్రతివాదాలకు సుప్రీంకోర్టు తెరదించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియ రాజ్యాంగ సూత్రాల పరిధిలోనే ఉందని, స్వతంత్ర పారదర్శక ఎన్నికల కోసం చేపట్టిన చర్యగానే చూడాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇది కేవలం బిహార్ కేసుకు సంబంధించిన తీర్పే అయినా, దేశవ్యాప్తంగా జరగబోయే 'సర్'లపై ప్రభావం పడటం ఖాయం. ఈ తీర్పు ప్రాముఖ్యత చాలా పెద్దది.

తీర్పులో అత్యంత కీలకమైన అంశం.. ఓటర్ల జాబితాలో పేరు చేర్చడానికి పౌరసత్వాన్ని తనిఖీ చేసే అధికారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉందని కోర్టు తేల్చడం. 'నకిలీ ఓటర్లను' తొలగించే నెపంతో సంఘం పౌరసత్వ తనిఖీలు చేస్తోందన్న వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. విధానపరమైన రక్షణలను ఈ ప్రక్రియలో పాటించినట్టు కూడా గుర్తించింది. అంతేకాదు, ఎస్ఐఆర్ ప్రక్రియ పౌరసత్వాన్ని నిరూపించుకునే భారాన్ని ఓటర్లపైనే నెట్టివేసిందన్న పిటిషనర్ల వాదనను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. ఇక్కడే ఒక సహజమైన ప్రశ్న ఉదయిస్తుంది. ప్రక్రియ రాజ్యాంగబద్ధమని తేలిపోయాక, విధానపరమైన రక్షణలు పాటించారని కోర్టు అంగీకరించాక, ఇంకా విపక్షాలు ఎందుకు భయపడుతున్నాయి? తీర్పును ఒక న్యాయవాది 'న్యాయవ్యవస్థకు చీకటి రోజు' అని అభివర్ణించడంలోని ఆందోళన దేనికి?


దీనికి సమాధానం 'సర్' లక్ష్యంలోనే దాగి ఉంది. పెరుగుతున్న పట్టణీకరణ, వలసలు, ఒకే వ్యక్తి పేరు రెండు మూడుచోట్ల నమోదు కావడం (డూప్లికేషన్), కొత్త నివాసితుల రాక -ఇవన్నీ గత కొన్నేళ్లుగా ఓటర్ల జాబితాను అస్తవ్యస్తం చేశాయి. పేర్లు పదేపదే చేరడం, తొలగడం సాధారణ ప్రక్రియ ద్వారా సరిదిద్దలేని స్థాయికి చేరింది. ఇలాంటి అవకతవకలను ఏరివేయడం ద్వారా జాబితాను శుద్ధి చేయడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అంటే -ఒక్కో అర్హుడైన పౌరుడికి ఒక్కటే ఓటు; ఎలాంటి నకిలీ, నమోదు అవకతవకలకూ తావు లేకుండా జరిగే నిష్పక్షపాత ఎన్నిక. ఇది ప్రజాస్వామ్యానికి బలమే తప్ప బలహీనత కాదు. మరి, స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను ఎవరైనా ఎందుకు వ్యతిరేకిస్తారు? ఒక రాజకీయ పక్షం తన ఓటు బ్యాంకును అవకతవకల ఆధారంగా నిలబెట్టుకుంటోందన్న అనుమానం ఉన్నప్పుడే, జాబితా శుద్ధి ఆ పక్షానికి ఆందోళన కలిగిస్తుంది. తమకు అనుకూలంగా పనిచేస్తున్నాయని భావిస్తున్న 'మిగులు' పేర్లు తొలగిపోతే తమ పునాది కదులుతుందన్న భయమే ఈ ప్రతిఘటనలో ప్రతిబింబిస్తోందన్నది అధికార పక్షం వాదన. రాహుల్ గాంధీ మొదటి నుంచీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడాన్ని, చొరబాటుదారులు, నకిలీ ఓటర్ల పక్షాన నిలబడటంగా బీజేపీ అభివర్ణించడం వెనుక ఈ తర్కమే ఉంది. 'ఎవరు దాచుకోవాల్సింది ఏదీ లేదో వారు తనిఖీకి భయపడరు' అన్నదే ఇక్కడ గమనించాల్సిన అంశం.

అంతేకాదు, విపక్షాలు లేవనెత్తుతున్న భయాలను తీర్పు చాలావరకు చల్లార్చింది. ఎస్ఐఆర్ తనిఖీ అనేది ఒక వ్యక్తి పౌరసత్వంపై తుది నిర్ణయం కాదని కోర్టు స్పష్టంగా చెప్పింది. ఒకవేళ ఓటరు వద్ద పత్రాలు లేకున్నా, తనిఖీలో విఫలమైనా.. ఆ వ్యవహారాన్ని పౌరసత్వ చట్టం ప్రకారం తుది నిర్ణయం కోసం కేంద్ర అధికార యంత్రాంగానికి పంపించవచ్చని పేర్కొంది. అంటే, ఎన్నికల సంఘం ఏకపక్షంగా ఎవరి పౌరసత్వాన్నీ రద్దు చేయజాలదు. ఒక్క తనిఖీలో పేరు పడకపోతే పౌరసత్వమే పోతుందన్నది అతిశయోక్తి అని ఈ తీర్పు తేల్చింది. ఈ స్పష్టత ఉండగా 'చీకటి రోజు' అని ముద్ర వేయడం అతిశయోక్తి కాదా అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

అయితే -ఒక సంపాదకీయం అధికార పక్షపు ప్రచారానికి ప్రతిధ్వనిగా మారకూడదు. విపక్షాల ఆందోళనల్లో రాజకీయ స్వార్థమే కాదు, నిజమైన ప్రజాస్వామిక ప్రశ్నలూ ఉన్నాయన్నది నిజాయితీగా అంగీకరించాలి. సీనియర్ జర్నలిస్ట్ రాజదీప్ సర్దేశాయ్ లేవనెత్తిన ప్రశ్న ఇంకా సమాధానం లేకుండా మిగిలే ఉంది. తొందరపాటుగా చేసిన ఎస్ఐఆర్ వల్ల జాబితా నుంచి వెలుపలికి నెట్టివేయబడిన లక్షలాదిమంది నిజమైన భారతీయ పౌరుల పరిస్థితి ఏమిటి? వారు తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును, సంక్షేమ పథకాల లబ్ధిని ఒక సాంకేతిక తనిఖీ లోపం వల్ల కోల్పోతే అది ప్రజాస్వామ్యానికి తీరని నష్టమే. 10 శాతానికి పైగా పేర్లు తొలగించారన్న ఆరోపణ నిజమైతే, అందులో ఎంతమంది నిజమైన ఓటర్లు ఉన్నారన్న లెక్క కచ్చితంగా బయటకు రావాలి. అలాగే తీర్పు ఇచ్చిన సమయం కూడా ప్రశ్నార్థకమే. ఎస్ఐఆర్ ఆధారంగానే పలు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిపోయిన చాలా నెలల తర్వాత ఈ తీర్పు రావడం -'న్యాయం ఆలస్యమైతే న్యాయం నిరాకరించినట్లే' అన్న సూత్రాన్ని గుర్తుచేస్తుంది. ఎన్నికలు అయిపోయాక జాబితా చెల్లుబాటును సమర్థించడంవల్ల, అప్పటికే ఓటు హక్కు కోల్పోయినవారికి ఒనగూరే ఉపశమనం ఏమిటన్నది మిగిలిపోయిన ప్రశ్నే. ఈ కారణంగానే, ప్రక్రియ రాజ్యాంగబద్ధమని తేలినా, దాని అమలులో పారదర్శకత, వేగం, సమతుల్యత గురించి ప్రశ్నలు సజీవంగానే ఉన్నాయి. ఈ సందర్భంలోనే సుప్రీంకోర్టు మరో కీలక హెచ్చరిక చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఆమోదించే పత్రాల ఎంపికలో సమతుల్యత పాటించడం అవసరమని. ఇది ఎన్నికల సంఘానికి ఒక బాధ్యతను అప్పగిస్తోంది. ఏ పత్రాలను ఆమోదించాలి, ఏవి ఆమోదించకూడదు అన్న విషయంలో సంఘం పేదలకు, గ్రామీణులకు, వలస కార్మికులకు ప్రతికూలంగా మారే నిబంధనలను విధించకుండా జాగ్రత్తపడాలి. లేకపోతే, 'శుద్ధి' పేరుతో అట్టడుగు వర్గాల ఓటు హక్కుకు అడ్డుకట్టపడే ప్రమాదముంది.

చివరగా, ఈ తీర్పును రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు. ఒకటి -ఇది ఎన్నికల సంఘం చేతికి ఎదురులేని అధికారాన్ని కట్టబెట్టింది అన్న భయం. రెండోది -ఇది స్వచ్ఛమైన ఓటర్ల జాబితా దిశగా ఒక అవకాశం, దానిని పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత ఇప్పుడు సంఘంపై ఉంది అన్న ఆశ. విపక్షాల వణుకు పూర్తిగా రాజకీయ స్వార్థమూ కాదు, పూర్తిగా ప్రజాస్వామిక ఆందోళనా కాదు -ఈ రెండింటి మిశ్రమం. కానీ తీర్పు తర్వాత వారికి మిగిలిన ఏకైక బలమైన ఆయుధం 'ప్రక్రియ లోపభూయిష్టంగా అమలైంది' అన్నదే తప్ప 'ప్రక్రియే రాజ్యాంగ విరుద్ధం' అన్నది కాదు. ఆ లోపాలను ఎత్తిచూపడం ద్వారా జాబితా శుద్ధిని మరింత నిష్పక్షపాతంగా మార్చగలిగితే అది దేశానికి మేలు. అలా కాకుండా కేవలం రాజకీయ నినాదంగా మిగిలిపోతే మాత్రం తనిఖీకి భయపడేదెవరు? అన్న ప్రశ్నకు ప్రజలే సమాధానం వెతుక్కుంటారు.

ప్రజాస్వామ్యానికి బలమైన పునాది స్వచ్ఛమైన ఓటర్ల జాబితా. ఆ జాబితా శుద్ధిని వ్యతిరేకించడం కాదు, దాని అమలులో ఒక్క నిజమైన పౌరుడి ఓటు హక్కు కూడా పోకుండా చూడటమే అసలైన ప్రజాస్వామిక బాధ్యత. ఇప్పుడు బంతి ఎన్నికల సంఘం కోర్టులోనే ఉంది!! ■



ఉత్సుకతను శక్తిగా మార్చుకునే కొత్త టెక్నిక్‌ను జెన్ జీ అలవాటు చేసుకుంటోంది. గొప్ప విషయం కదా! మంచో చెడో.. పనికొచ్చేదో పనికిరానిదో ఏదైనా కావొచ్చు.. కానీ కొత్త విషయాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస ఈ-తరంలో బలంగా కనిపిస్తోంది. నిజానికి -ప్రపంచంలో ప్రతి ఆవిష్కరణకూ అదే ఆరంభ బిందువు. మనకు ఎదురయ్యే చిక్కు ప్రశ్నలను విస్మరించడం మానుకొని, వాటిని లోతుగా అన్వేషించడం మొదలు పెట్టినప్పుడే జీవితంలో అద్భుతాలు జరగడం ప్రారంభమవుతుంది. ప్రపంచంలోని గొప్ప ఆవిష్కరణలకు ఈ సూత్రమే మూలం.

-మహాదేవ

**వింతల్లో వింతలు**

## ఫ్రెష్ ఫీట్ జ్యూస్!



వేలంవెర్రికి పరాకాష్టలా ఉంది కదా ఈ చిత్రం. కానీ, ఇది నిజమే. "ఫీట్ జ్యూస్" అనేది కాలిఫోర్నియాలోని శాన్ జోస్‌లో జరిగిన పార్కన్ 2026 అనే యానిమే కన్వెన్షన్ వెలుపల, అనధికారిక ఓపెన్-ఎయిర్ ఈవెంట్‌లో చోటుచేసుకున్న వింతైన వివాదాస్పదమైన ఇంటర్నెట్ ట్రెండ్. కొందరు కాస్‌ప్లేయర్స్ (రకరకాల పాత్రల దుస్తులు ధరించిన మోడల్స్) ప్లాస్టిక్ కూలర్‌లలో ఎర్రటి జ్యూస్ పోసి, అందులో తమ నిజమైన పాదాలను ముంచి ఒక్కో కప్పును 10 నుంచి 15 డాలర్లకు విక్రయించారు. ఆశ్చర్యకరంగా, జ్యూస్‌ను కొనడానికి అక్కడ భారీగా జనాలు క్యూ లైన్లలో నిలబడ్డారు. మరీ చిత్రమేంటంటే గంటలోనే జ్యూస్ మొత్తం అమ్ముడు పోయింది.

## టైం చూసుకుని వస్తున్నాడు!




తమిళ స్టార్ హీరో సూర్య నటించిన రీసెంట్ మూవీ 'కరుప్పు' బాక్సాఫీస్ దగ్గర బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్‌తో దూసుకెళ్తోంది. సూర్య కెరీర్‌లో ఈ సినిమా సాలిడ్ హిట్‌గా నిలిచి ఆయనకు చాలా రోజుల తర్వాత ఓ బ్లాక్‌బస్టర్ హిట్ అందించింది. ఇక ఈ సినిమా ఇచ్చిన బూస్ట్‌తో తన నెక్స్ట్ చిత్రాన్ని రిలీజ్‌కు రెడీ చేస్తున్నాడు ఈ హీరో. దర్శకుడు వెంకీ అట్లూరి డైరెక్షన్‌లో సూర్య నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ఫస్ట్‌లుక్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా.. తాజాగా ఈ చిత్రాన్ని ఆగస్టు 14న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఎమోషన్స్, డ్రామా, పక్కా ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో కూడిన కథతో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది. ఈ వైబ్రెంట్ పోస్టర్‌లో సూర్య ఒక డెప్త్ ఉన్న రోల్‌లో కనిపిస్తాడు. ఈ ఏడాది పండుగ సీజన్‌కు వస్తున్న అతిపెద్ద క్రేజీ ప్రాజెక్ట్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది. ఈ చిత్రంలో మమితా బైజు, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.




### సందీప్ సినిమాల్లో హీరోయిన్లు
## గ్లామర్‌కే పరిమితం కాదు..



సందీప్ వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా షూటింగ్‌లో త్రిప్తి డిమ్రీ జాయినయ్యారు. అయితే ఆమె పాత్ర గ్లామర్‌కే పరిమితం అవుతుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మరో డైరెక్టర్ హేమంత్ మధుకర్ స్పందిస్తూ.. సందీప్ వంగా సినిమాల్లో హీరోయిన్ క్యారెక్టర్లు చాలా బలంగా ఉంటాయన్నారు. త్రిప్తి పాత్ర ప్రేక్షకులను కచ్చితంగా ఆశ్చర్యపరుస్తుందని పేర్కొన్నారు. "సందీప్ రెడ్డి వంగా మహిళా పాత్రలను రాసే విధానాన్ని ప్రేక్షకులు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ఆయన సినిమాల్లోని కొన్ని ఇంటిమేట్ సీన్స్ చూసి, హీరోయిన్‌కు కేవలం గ్లామర్ పాత్రలే ఇస్తారని అనుకుంటారు. కానీ మీరు నిశితంగా పరిశీలిస్తే.. సందీప్ మహిళలకు చాలా బలమైన, వైవిధ్యమైన పాత్రలను ఇస్తారు. 'అర్జున్ రెడ్డి' సినిమాలో శాలిని పాండే పాత్రను చూస్తే.. ఆమె ఎక్కువగా సింపుల్ కాస్ట్యూమ్‌లోనే కనిపిస్తూ చాలా హోమ్లీ ఇమేజ్ ఉంటుంది. కానీ ఆ క్యారెక్టర్లో ఎంతో ఎమోషన్ ఉంది. అలాగే 'యానిమల్' సినిమాలో రష్మిక పాత్రను గమనిస్తే.. భర్తకు, కుటుంబానికి మధ్య జరిగే ఘర్షణలను తట్టుకునే ఒక బలమైన భార్యగా చూపించారు. 'యానిమల్' హీరో సెంట్రిక్ ఫిల్మ్ అయినప్పటికీ రష్మిక తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు" అని హేమంత్ అన్నారు. "హీరో, హీరోయిన్, విలన్.. ఇలా అందరి పాత్రలను సమానంగా, పవర్ఫుల్ రాయడంపైనే సందీప్ వంగా దృష్టి పెడతారు. ఇక 'స్పిరిట్' సినిమాలో దీపికా పదుకొణె స్థానంలో త్రిప్తి వచ్చారనే వార్తలను నేను పట్టించుకోను. ఈ రోజుల్లో దర్శకులు వారు రాసుకున్న పాత్రకు ఎవరు సరిపోతారో చూసి ఎంపిక చేసుకుంటారు. త్రిప్తి కచ్చితంగా అందరి అంచనాలను అందుకుంటారని నేను నమ్ముతున్నాను" అని హేమంత్ అన్నారు.

## ఒక్క సినిమా..
## ఇద్దరికి టెస్ట్



తెలుగులో స్టార్ స్టేటస్ అందుకున్న పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్‌లకు గత కొన్నేళ్లుగా హిందీలో మాత్రం ఒక సాలిడ్ బ్లాక్‌బస్టర్ హిట్ పడలేదు. ఈ నేపథ్యంలో వీరిద్దరూ కలిసి వరుణ్ ధావన్ సరసన హీరోయిన్‌లుగా నటించిన హిందీ రొమాంటిక్ డ్రామా 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్ర ట్రైలర్‌లో తమ గ్లామరస్ లుక్స్‌తో మెప్పించిన ఈ ఇద్దరు భామల బాలీవుడ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకం కానుంది. ప్రముఖ దర్శకుడు డేవిడ్ ధావన్ దర్శకత్వంలో టిప్స్ ఫిల్మ్స్ నిర్మాణంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం జూన్ 5న థియేటర్లలో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ ఇద్దరు భామలు సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా గడుపుతున్నారు.

## డాన్-3.. కండిషన్స్ అప్లై

బాలీవుడ్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న 'డాన్-3' సినిమా కొన్ని రోజులుగా వార్తల్లో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ఒక వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఆ ఫ్రాంచైజీలోకి మళ్లీ షారుక్ ఎంట్రీ ఇస్తే బాగుంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. గతంలో రెండు భాగాల్లోనూ షారుక్ ఖాన్ తన అద్భుతమైన నటనతో 'డాన్' పాత్రకు ప్రాణం పోశారు. అయితే మూడో భాగం స్క్రిప్ట్ విషయంలో విముఖత వ్యక్తం చేస్తూ ఆయన ఈ సినిమాను తిరస్కరించినట్టు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఇప్పుడు 'డాన్-3' నుంచి రణ్‌వీర్ వైదొలగడంతో మూవీ టీమ్ మళ్లీ షారుక్‌తో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, షారుక్ ఈ సినిమా చేయడానికి ఒక ఆసక్తికరమైన కండిషన్ పెట్టినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 'జవాన్' చిత్రంతో తనకు భారీ బ్లాక్బస్టర్ అందించిన దర్శకుడు అట్లీని ఈ ఫ్రాంచైజీలోకి తీసుకొస్తేనే తాను మళ్లీ 'డాన్' పాత్రను పోషించడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆయన స్పష్టం చేశారట. దీనిపై అధికారిక ప్రకటన రానప్పటికీ బాలీవుడ్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. 2022లో షారుక్ 'డాన్-3'ని నిరాకరించడంతో మేకర్స్ రణ్‌వీర్ సింగ్ను ఎంపిక చేశారు. అయితే, గ్యాంగ్‌స్టర్ కథాంశంతో తెరకెక్కిన 'ధురంధర్' ఘనవిజయం తర్వాత రణ్‌వీర్ సింగ్ తన ఎంపికల విషయంలో జాగ్రత్త వహిస్తూ 'డాన్' మూడో భాగం నుంచి వైదొలిగారు. దీనిపై వివాదం కొనసాగుతోంది. ఇక ఈ సినిమాలో ఇతర నటీనటుల విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. హీరోయిన్‌గా మొదట కియారా అద్వాణీని అనుకున్నప్పటికీ, ప్రస్తుతం ఆమె స్థానంలో కృతిసనన్ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అలాగే విలన్ పాత్ర కోసం విక్రాంత్ మాస్సే, విజయ్ దేవరకొండలను సంప్రదించారని టాక్..!





## పబ్లిసిటీ కోసం కాదు

వేరే పరిశ్రమకి వెళ్లినప్పుడు అక్కడి స్థానిక భాష మాట్లాడటం చాలా ముఖ్యమని, ఇదంతా పబ్లిసిటీ కోసం కాదంటోంది అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించే ఈ భామ.. తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె వివిధ ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం గురించి మాట్లాడింది. "నా విషయానికొస్తే... నేను ప్రతి భాషను గౌరవిస్తాను. పలు చిత్ర పరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటూ పనిచేస్తున్నా... కాబట్టి ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు తప్పకుండా అక్కడి భాషలోనే మాట్లాడతా. ఆ ప్రదేశానికి, అక్కడి భాషకు, ప్రజలకు ఇచ్చే గౌరవం అది. సినీతారలకు, ప్రేక్షకులకు మధ్య భాష ఒక భావోద్వేగ వారధిలాగా ఉంటుంది. అందుకే ప్రచార కార్యక్రమాల్లో స్థానిక భాషల్లో మాట్లాడటం వల్ల వారి మధ్య దూరం తగ్గుతుందనేది నా అభిప్రాయమ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో కార్తిక్ ఆర్యన్‌తో ఓ ప్రేమకథా చిత్రంతోపాటు ధనుష్ నటిస్తున్న మరో సినిమాలో నాయికగా నటిస్తుంది.

## 'జైలర్ 2'లో హృతిక్ క్యామియో?

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'జైలర్-2'పై మరో సంచలన వార్త కోలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న సీక్వెల్‌లో ఓ పవర్‌ఫుల్ క్యామియో పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌ను సంప్రదిస్తున్నట్టు సమాచారం. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా మరింత ఆసక్తి పెరిగింది. తమిళ సినీవర్గాల కథనాల ప్రకారం.. మొదట ఈ ప్రత్యేక పాత్ర కోసం బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్‌ను సంప్రదించారట. అయితే ఆయన ప్రస్తుతం నటిస్తున్న 'కింగ్' సినిమా షూటింగ్ షెడ్యూల్స్ బిజీగా ఉండటంతో ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్టు తెలుస్తోంది. దీంతో ఇప్పుడు మేకర్స్ దృష్టి హృతిక్ రోషన్‌పై పడినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ వార్తలపై చిత్రబృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇక 'జైలర్' మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలన విజయం తెలిసిందే. రజనీకాంత్ కెరీర్‌లో మరో భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన వసూళ్లు సాధించింది. ముఖ్యంగా ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజనీకాంత్ చూపించిన మాస్ అవతార్ అభిమానులను ఉర్రూతలూగించింది. ఇప్పుడు అదే కథను కొనసాగిస్తూ 'జైలర్ 2' తెరకెక్కుతోందని సమాచారం. ఈ సీక్వెల్‌లో కూడా భారీ తారాగణమే కనిపించబోతోందని తెలుస్తోంది. రజనీకాంత్‌తో పాటు మిథున్ చక్రవర్తి, విద్యాబాలన్, ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజారమూడు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. మొదటి భాగంలో తమ క్యామియోలతో థియేటర్లలో అభిమానులను ఉర్రూతలూగించిన మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కూడా ఈసారి తమ పాత్రలను కొనసాగించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న 'జైలర్ 2'ను 2026 సెప్టెంబర్ 11న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే రజనీకాంత్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. కమల్ హాసన్ నిర్మాణ సంస్థ 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' బ్యానర్‌పై తెరకెక్కనున్న 'తలైవర్ 173'లో కూడా ఆయన నటించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు దర్శకుడిగా మొదట సుందర్ సి పేరు వినిపించినా, తర్వాత సిబి చక్రవర్తి పేరు తెరపైకి వచ్చింది. అయితే తాజా సమాచారం ప్రకారం 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మరిముత్తు ఈ సినిమాను తెరకెక్కించే అవకాశముందని టాక్ నడుస్తోంది. మరోవైపు రజనీకాంత్ - – కమల్ హాసన్ కాంబినేషన్‌లో నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ఓ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ కూడా చర్చల్లో ఉంది. ప్రస్తుతం KHxRK పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నట్లు తెలుస్తోంది.